సంచిక 3 - సెప్టెంబర్ 2017

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా

సంచిక 3, సెప్టెంబర్ 2017

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్
నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు - 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email : leisaindia@yahoo.co.in



| | |
|---|---|
| లీసా ఇండియా | ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు. |
| చీఫ్ ఎడిటర్ | కె.వి.యస్. ప్రసాద్ |
| మేనేజింగ్ ఎడిటర్ | టి.యమ్. రాధ |
| అనువాదం | రామ శేషు సూరంపూడి |
| అనువాద సమన్వయం | పూర్ణిమ |
| అడ్మినిస్ట్రేషన్ | రుక్మిణి జి. జి. |
| డిజైన్ లేఔట్ | శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్ |
| ముద్రణ | స్పాన్ ప్రింట్, బెంగళూరు |
| కవర్ ఫోటో | ఆర్యాన్యక్ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ సభ్యత్వం తీసుకున్న షకీలా ఖతూన్ కండ్లలో విజయోత్సాహం... |
| ఫోటో | బి.ఎ.ఐ.ఎఫ్ |



## లీసా మేగజైన్

**ఇతర ఎడిషన్లు**

లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు ఈస్ట్ ఆఫ్రికన్ ఎడిషన్

## లీసా ఇండియా మేగజైన్

**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**

హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ

ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.

మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం

## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.

ధర్మకర్తలు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్ |
| సభ్యులు | : | డా. విఠల్ రాజన్, డా. ఎం. మహదేవప్ప, డా. ఎన్. జి. హెగ్డే, డా. టి.ఎం. త్యాగరాజన్, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎ. రాజన్న, డా. వెంకటేష్ తగత్, డా. స్మిత ప్రేమ్‌చందర్ |
| కోశాధికారి | : | శ్రీ బి.కె. శివరాం |
| ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ | : | శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్ |



## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్ధిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులకు,

సెప్టెంబర్, 2017 సంచికను మీ చేతులకు అందిస్తున్న ఈ సందర్భం మాకు చాలా ఆనందం కలిగిస్తోంది. ఈ సంచికలో మీకు ఎంతో ఆసక్తి కలిగించే ఎన్నో అంశాలను మీ కోసం పొందుపరిచాం. అలాంటి వాటిలో భాగస్వామ్య ప్రయోగాల రూపంలో మెరుగైన విత్తనాలను అభివృద్ధి చేసే విధానాలను, భాగస్వామ్య కృషిని పెంపొందించేందుకు చేపట్టిన ప్రోత్సాహకాలు, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను గురించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి అందించేందుకు మేము ప్రయత్నించాం.

కొల్లీ పర్వత శ్రేణుల్లోనూ, వైనాడ్‌లోనూ కసావా, ఎలిఫెంట్ ఫుట్ యార్న్ సాగులో మెరుగైన విత్తనాలను తయారు చేయడం కోసం భాగస్వామ్య పద్ధతిలో పరిశోధనలు, ప్రయోగాలు నిర్వహించడం జరిగింది. లాభాపేక్షలేని టెక్నోసెర్వ్‌తో పాటు ప్రధాన స్రవంతిలోని కృషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో రైతులు సాధించిన విజయమే చిన్నకారు రైతులకు సాధికారత. టెక్నోసెర్వ్ సంస్థ బీహార్‌లో వ్యవసాయ దారులకు ఉపయోగపడే సమాచారాన్ని, మార్కెట్ అవకాశాల గురించిన వివరాలు సేకరించడంలో విస్తృతంగా కృషిచేసింది. ఇక కరూర్ జిల్లా పరిసరాలలో బహుళ సంఖ్యలోని సంస్థల సహకారంతో సేంద్రీయ వ్యవసాయం విస్తరించేందుకు కృషి విజ్ఞాన్ కేంద్రాలు తోడ్పడ్డాయి. ఫలితంగా అక్కడి సామాన్య రైతుల ఆదాయం పెరిగింది. ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. వారిలో అంతులేని ఆత్మవిశ్వాసం చోటు సంపాదించుకుంది.

పర్యావరణ హితకరమైన సేద్య విధానంలో రైతన్నలు నిరంతరం మెరుగైన మేలు జాతి విత్తనాల తయారీపై దృష్టి ఉంచుతారు. అంటే ఒక రకంగా రైతన్నల ఆసక్తే పర్యావరణానికి శ్రీరామరక్ష అని చెప్పవచ్చు. పర్యావరణ అనుకూల సేద్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా సమాచార మార్పిడికి చాలా ప్రాధాన్యత ఉంది. అయితే అనుబంధ వ్యవస్థలు, రైతన్న సామర్థ్యం పెంపు విధానాలు, వారికి అనుకూలమైన పాలకుల విధానాలు కూడా అంతే కీలకమైనవి. అప్పుడే వ్యవసాయం సుస్థిరం కావడంతో పాటు జీవనోపాధులు బహుముఖంగా విస్తరిస్తాయి.

మా ఈ ప్రయత్నాలకు మీ నుంచి అందే సలహాసూచనలు అమూల్యమైనవి. వాటికోసం నిత్యం ఎదురుచూస్తూ ఉంటాం. మీరు మరెవరైనా రైతన్నకు ఈ మేగజైన్‌ను అందించాలని ఆశిస్తే వారి పూర్తి చిరునామా మాకు అందజేయండి. మహానందంగా మేము వారికి కూడా ఈ మేగజైన్ పంపిస్తాం.

సంపాదకులు



**పంటల వైవిధ్యం - చేనుకు మరింత చేవ.......... ఈడీఐ అలివర్ కింగ్, ..నట్‌కావ్** **4**

వాణిజ్య పంటలను ఏక పంటగా చేసే సాగు మరింత ఆదాయం కోసం చేపట్టడం సేద్య విధానాలను సర్వ నాశనం చేస్తున్నాయి. ఇంకా స్థానికంగా వాడుకలో ఉన్న పంటల వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా, పేద ప్రజలకు ఆహార భద్రత, వాతావరణ సమతుల్యతకూ హాని కలుగుతోంది. అలాంటి సమయంలో భాగస్వామ్య పద్ధతిలో.... ఉపయోగపడ్డాయి.



**పర్యావరణ - సేద్య సమాచార మార్పిడి ................................ టి.ఎం. రాధా** **8**

పర్యావరణహిత సేద్యం అనుసరించడం ద్వారా రైతన్నలకు ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా వారు నిత్యం వ్యవసాయ కార్యకలాపాలలో అనుసరించే విధానాల నుంచి పరిస్థితులు, వనరులు, పరిజ్ఞానానికి అనుగుణంగా స్వీయ అనుభవాల ప్రాతిపదికగా సమస్యలకు పరిష్కారం కనుగొనటం..... చెప్పుకోవాలి.



**సేంద్రీయ సేద్యం ప్రోత్సాహక సంస్థలు......ఎస్. వల్లల్ కన్నన్, పి. ఆనంద ప్రియ, పి. తమిల్ సెల్వి** **13**

సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వడం కోసం ప్రధాన స్రవంతిలోని సంస్థలు కొన్ని పరస్పర సహకారం ప్రాతిపదికగా కృషిచేస్తున్నాయి. కరూర్ జిల్లాలోని కృషి విజ్ఞాన్ కేంద్రం సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులను మళ్లించడానికి తన అనుబంధ సంస్థల సహకారంతో ప్రయత్నిస్తోంది. అదే సమయంలో వారి ...... కృషి చేసింది.



**బేరసారాల్లో రైతన్నకు మద్దతు............... దేవరాజన్ పూజాహరి - ఆర్తీదయాల్** **17**

లాభాపేక్షలేని టెక్నోసెర్వ్ వంటి సంస్థలు భాగస్వామ్య పద్ధతిలో చిన్న, సన్నకారు రైతన్నలకు బేరసారాల్లో తన వంతు మద్దతు అందిస్తున్నాయి. వారికి ఉపయోగపడే సమాచారం (ఇన్ఫర్మేషన్) అంటే మార్కెట్‌లో లభిస్తున్న అవకాశాల గురించిన సమాచారం అందించడానికి ఇలాంటి సంస్థలు కృషిచేస్తున్నాయి. టెక్నోసెర్వ్ ...నిర్వహించుకోగలుగుతున్నారు.

# పంటల వైవిధ్యం - చేనుకు మరింత చేవ

**ఈడీఐ అలివర్ కింగ్, ఎస్ అబూ బకర్ సిద్దిక్కీ, గిరిజన్ గోపి, నట్ కావ్**

**వాణిజ్య పంటలను ఏక పంటగా చేసే సాగు మరింత ఆదాయం కోసం చేపట్టడం సేద్య విధానాలను సర్వ నాశనం చేస్తున్నాయి. ఇంకా స్థానికంగా వాడుకలో ఉన్న పంటల వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా, పేద ప్రజలకు ఆహార భద్రత, వాతావరణ సమతుల్యతకూ హాని కలుగుతోంది. అలాంటి సమయంలో భాగస్వామ్య పద్ధతిలో మెరుగైన విత్తనాల ఎంపిక, పప్పు ధాన్యాలు, జొన్న పంటల మధ్య అంతర పంటలుగా ప్రయోగాత్మకంగా సాగుచేయడం, స్థానికంగా లభించే ఉత్తమ జాతి జొన్న విత్తనాల ఉత్పత్తిని ప్రోత్సహించడం, ఉమ్మడి విత్తన బ్యాంకుల నిర్వహణకు తోడ్పడడం వంటి ప్రయత్నాలు వ్యవసాయ రంగాన్ని మరింత ప్రయోగకరంగా, లాభసాటిగా మార్చడానికి ఉపయోగపడ్డాయి.**

ప్రకృతి సహజంగానే మన దేశంలో వివిధ రకాలైన మొక్కలు, జంతు సంపద సమృద్ధిగా ఉన్నాయి. అందువల్లనే ప్రపంచంలోనే జీవ వైవిధ్యంలో మన దేశానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. అయితే, అదృష్టం కలిసిరాకపోవడంతో ఇటీవల కాలంలో ఈ వైవిధ్యం అంతరించిపోతోంది. అందుకు ప్రధాన కారణాలు పరిసరాల విధ్వంసం, దూర ప్రాంతాల నుంచి శత్రురూపక క్రిమికీటకాల ప్రవేశం.

దక్షిణ భారత దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థానికంగా ఉన్న వైవిధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అధిక ఆదాయం కోసం వాణిజ్య పంటల సాగు జోరుగా సాగుతోంది. తమిళనాడులోని కొల్లి కొండల ప్రాంతంలోను, గడచిన మూడు దశాబ్దాలుగా వివిధ రకాలైన దుంపల సాగు (కసావా) సాగు జోరుగా సాగుతోంది. దాంతో అప్పటి వరకూ ఆహారం సమృద్ధిగా అందించే జొన్న సాగయ్యేది. ఇదే విధంగా ఒడిస్సాలోని జైపూర్‌లో సంప్రదాయక పంటల స్థానంలో యూకలిప్టస్ పెంపకం చురుకుగా సాగుతోంది. కేరళలోని వైనాడ్‌లో వరి సాగును పక్కన పెట్టి అరటి తోటల పెంపకం సాగుతోంది. ఇలా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా రైతులకు ఆదాయం ఇబ్బడిముబ్బడిగా వచ్చింది. అయితే మార్కెట్ అవసరాల ప్రాతిపదికన వాణిజ్య పంటల సాగు మాత్రమే విస్తృతంగా జరగడంతో పంటల సాగులో వైవిధ్యం పూర్తిగా లోపించింది. అదే సమయంలో భూసారం



*భాగస్వామ్య విత్తన ప్రక్రియ ప్రభావంతో విస్తరిస్తున్న పంటల సాగు వైవిధ్యం.*

అతి వేగంగా క్షీణించిపోవడం ప్రారంభమైంది. భూసారం క్షీణించిపోయే కొద్దీ పంటలకు హాని కలిగించే చీడపీడల బెడద ఎక్కువయింది. ఫలితంగా వాతావరణ వైరుధ్యాలు ప్రబలమై రైతన్నకు తీవ్రకష్టనష్టాలను తెచ్చిపెట్టాయి. మొత్తం మీద ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయింది. ప్రజలు ఇతర ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకునే ఆహార పదార్థాలపై ఆధారపడవలసిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న గోధుమలు, బియ్యమే వారికి శరణ్యమైంది.

దుంపల వంటి సాధారణ దినుసులు సంప్రదాయక వ్యవసాయంలో కుటుంబాల ఆకలి తీరుస్తుండేవి. అలాంటి వాటిని ఇతర పంటలతో పాటు పండించే విధానాన్ని ఏక పంట సాగు విధానంలో నిర్లక్ష్యం చేయడం జరిగింది. వీటిని సాగు చేసే కాలంలో వాటిని అమ్మటం ద్వారా రైతన్నకు మరి కొంత ఆదాయం లభించేది. ఇది గ్రామీణ భారతదేశంలో అంతటా సర్వసాధారణమైన వాస్తవ పరిస్థితి. అలాంటి కొల్లి కొండ పరిసరాలలో దాదాపు 70 శాతం కసావు సాగు జరుగుతోంది. సుమారుగా 7000 హెక్టార్లలో సాగు చేసే ఈ కసావా సాగు పూర్తిగా వాణిజ్య అవసరాల కోసమే జరుగుతోంది. అంటే ఈ ప్రాంతాలలో అత్యధిక భూమిని వాణిజ్య పంటల సాగుకే వినియోగించడం జరుగుతోంది. ఆహారంగా ఉపయోగపడని (హెచ్ 165) పంటను సాగు

చేస్తున్నారు. ఎందుకంటే ఈ తరహా పంటలలో అధిక శాతం పిండి పదార్థం (స్టార్చ్) లభిస్తుంది. ఇలా అత్యధిక భూభాగంలో కసావా సాగును మాత్రమే చేపట్టడం వల్ల పంటలకు చీడపీడల బెడద ఎక్కువైంది. భూసారం క్షీణించిపోయింది. దిగుబడి బాగా తగ్గిపోయింది. మిశ్రమ పంటల సాగును రైతులు విస్మరించారు. దానితో పాటే వ్యవసాయంలో వైవిధ్యం లోపించింది. ప్రజలకు ఆహారభద్రత లేకుండాపోయింది. వాతావరణ పరిస్థితులు నిలకడగా ఉండటంలేదు. ఈ పరిస్థితిని జాగ్రత్తగా అధ్యయనం చేసిన ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్) రంగంలోకి దిగింది. యూనివర్సిటీ అల్బర్ట్ సహకారంతో ఒక బృహత్ కార్యక్రమం చేపట్టింది. వ్యవసాయ వైవిధ్య కీలకాం శాలలో పేదరికం నిర్మూలన - పోషకాహార లోపం నివారణ కోసం ఈ యూనివర్సిటీ ఒక ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టింది. దానిని అగ్రోబయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్ ప్రాజెక్టు (ఏపీఎం)గా వ్యవహరిస్తారు. ఇందులో భాగంగా భాగస్వామ్యం ప్రాతిపదికన దుంపల వంటి కసావా సాగులో ఉన్నతమైన విత్తన ఎంపిక, పప్పు ధాన్యాలు, జొన్నలతో పాటు అంతర పంటల సేద్యం, జొన్న సాగులో అత్యుత్తమ శ్రేణి విత్తనాల అభివృద్ధికి విత్తన బ్యాంకుల ద్వారా కృషి సాగించింది.

కసావా సాగులోనూ, కంద దుంపల వంటి (ఎలిఫెంట్ యామ్) సాగులో భాగస్వామ్య ప్రక్రియ క్రింద కొల్లి కొండకోనల్లోను, వైనాడ్‌లోను చేపట్టిన పరిశోధనలు మెరుగైన విత్తనాలను అభివృద్ధి చేయటంలో రైతులకు ప్రోత్సాహం ఇచ్చాయి. అవి వారి అవసరాలకు అనువైనవిగా ఉన్నాయి. అధిక దిగుబడి, అధిక మొత్తంలో స్టార్చ్ (పిండి పదార్థాలు), కరువు కాటకాలను తట్టుకోవడంలో మరింత సామర్థ్యం, స్థానిక పరిస్థితులకు తట్టు కోగలిగే విధంగా విత్తనాలను రైతన్నలు రూపొందించగలిగారు. అంతర పంటల విధానం అనుసరించడం వల్ల స్వల్పకాలిక వ్యవధిలో సాగు వైవిధ్యాన్ని సమకూర్చుకోగలిగారు. ప్రధానమైన పంటల సాగుతో పాటు విభిన్నమైన ఇతర పంటలను కూడా అంతర పంటలుగా సాగుచేసుకోగలిగారు. ఫలితంగా పోషక విలువలతో కూడిన ఆహారం వారి కుటుంబాలకి అందడం ప్రారంభమైంది. అదనపు ఆదాయం లభించింది. వారి పంట పొలాలు మరింత భూసారాన్ని సంపాదించుకోగలిగాయి. కరువుకాటకాల నుంచి వారికీ, వారి పొలాలకు సంపూర్ణమైన భద్రత చేకూరింది.

## సాధించిన ఫలితాలు

## భాగస్వామ్య విత్తన ఎంపిక – కసావా సాగులో వైవిధ్యం

ప్రయోగాత్మకంగా వ్యవసాయ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్న మహిళలు, పురుషులతో సహా అనేక మంది సమష్టిగా భాగస్వామ్య పద్ధతిలో విత్తనాల ఎంపికకు ప్రయత్నాలు జరిగాయి. ఫలితంగా కసావా విత్తన రకాలలో అనేకం రూపుదిద్దుకున్నాయి. అందుకోసం కేరళలోని సెంట్రల్ ట్యూబర్ (దుంపల) క్రాప్స్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ నుంచి 11 రకాలైన కసావా విత్తనాలను సమకూర్చారు. రైతన్నలు చేపట్టిన ప్రయోగాల కారణంగా సిఎంఆర్1, సిఎంఆర్73, శ్రీరేఖ రకాలు సిద్ధమయ్యాయి. వాటిని మేలు జాతికి చెందిన హెచ్165 విత్తనాలతో పోల్చవచ్చు. ఈ మూడు రకాలైన విత్తనాల ద్వారా సాగు చేస్తే అధిక పిండి పదార్థాలు (27-29 శాతం) ఉన్న కసావా సాగు సాధ్యమవుతుంది. ఇదే హెచ్ 165 రకంతో లభించే దుంపల్లో 24 శాతం వరకే పిండి పదార్థాలు లభిస్తాయి. ఇక మహిళా రైతుల కృషి ఫలితంగా అందుబాటులోకి వచ్చిన శ్రీరేఖ వంగడం ద్వారా లభించే ఫలసాయాన్ని ఆహారంలో భాగంగా ఉపయోగించుకోవచ్చు. ఈ ప్రయోజనాలను గమనించిన తరువాత వాటిని అక్కడి వ్యవసాయదారులకు సమకూర్చడానికి కృషి జరుగుతోంది. ఇందువల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే ఈ ప్రాంతంలో సాగు చేసే కసావా సాగులో వైవిధ్యానికి చోటు దక్కింది.

## అదనపు ఆదాయం కోసం అంతర పంటల సాగు

మరో ప్రయోగాత్మక ప్రయత్నంలో కొల్లి హిల్స్ ప్రాంతంలో ఫింగర్ మిల్లెట్స్ (మొక్క జొన్న), బ్లాక్ బీన్స్ (నల్ల చిక్కుడు), ఉల్లి సాగును అంతర పంటలుగా సేద్యం చేయడం జరిగింది. ఇది పంటల సాగులో వైవిధ్యానికి దారితీసింది. జొన్న సాగులో అంతర పంటగా కసావా సాగు చేపట్టినప్పుడు మెరుగైన ఫలితాలు లభించాయి. జొన్న దిగుబడి ఎకరాకు 170 కిలోలు వచ్చింది. అంటే 12 శాతం అధిక ఆదాయం రైతుకు సమకూరింది. ఇక బ్లాక్ బీన్స్ సాగులో అంతర పంటలుగా తీసుకున్నప్పుడు కసావా దిగుబడి ఎకరాకు 140 కిలోల వరకు వచ్చింది. ఆదాయం 23 శాతం పెరిగింది. ఇక పప్పు ధాన్యాలు, జొన్నల సాగుతో కసావా సాగు చేసినప్పుడు ఎకరాకు 110 కిలోల జొన్న, ఎకరాకు 80 కిలోల పప్పులు దిగుబడిగా దక్కింది. అంటే ఆదాయం 21.5 శాతం వచ్చింది. వారికి దక్కిన అదనపు ఆదాయం అంతా కసావా సాగు ద్వారానే లభించడం గమనించాలి.

రైతుల ప్రోత్సాహంతో ఉల్లి విషయంలో చేసిన ప్రయత్నం ఎకరాకు 300 కిలోల ఉల్లి దిగుబడి వచ్చింది. ఫలితంగా వారికి దాదాపు 60 శాతం అదనపు ఆదాయం లభించింది. ఇలా అంతర



*ఉత్తమ విధానాలు అనుసరించిన రైతుల కృషి ఫలితంగా మేలు జాతి కంద సాగు విత్తనాలు రూపుదిద్దుకోవడం ఒక విశేషం...*

పంటగా సాగు చేయడం వల్ల కసావా దిగుబడిలో ఎలాంటి వ్యతిరేక ఫలితాలు కనిపించలేదు. జొన్న, పప్పులు, ఉల్లి మాత్రమే ఇదివరలో సాగు చేసేవారు. ఇప్పుడు అంతర పంటల రూపంలో దుంపల సాగు చేస్తున్నారు.

సాగులో భాగంగా కాయధాన్యాల ఉత్పాదనను కూడా చేపట్టిన కారణంగా, భూసారం గణనీయంగా మెరుగుపడింది. అంతేకాక కుటుంబాలలోని మహిళలు, చిన్నారులకు అధిక ప్రయోజనాలు చేకూరాయి. అందుకు అంతర పంటల విధానం చాలా వరకు తోడ్పడింది. అదే సమయంలో జొన్నలు, పప్పు ధాన్యాల వంటి విభిన్నమైన ఆహార పంటల సాగు ఎక్కువయింది.

తామరకులం గ్రామానికి చెందిన 28 ఏండ్ల కల్లై సెల్వీ ఇలా అభిప్రాయం వ్యక్తంచేశారు. - చాలాకాలం పాటు మేము కసావా మాత్రమే ఏకపంటగా సాగుచేసేవాళ్లం. చాలీ చాలని రాబడి. ఇప్పుడు కొత్తగా అనుసరించిన అంతర పంటల విధానం మా జీవితాల్లో చాలా మార్పు తెచ్చింది. ఫింగర్ మిల్లెట్స్ సాగుతో మొదలుపెట్టి బ్లాక్ బీన్ సాగు కూడా ప్రారంభించాం. కసావా సాగులో ఇదివరకు వచ్చిన దిగుబడి కొంత వరకూ అధిక దిగుబడినే సంపాదించగలిగాం. మా కుటుంబానికి అదనపు ఆహారం లభించింది. ఇప్పుడు మా కుటుంబం బయట మార్కెట్‌లో దొరికే ఆహార పదార్థాల మీదే ఎక్కువగా ఆధారపడవలసిన దుస్థితి తప్పిపోయింది. ఆ రకంగా కసావా సాగు ద్వారా వచ్చే ఆదాయం వేరే చోట ఆహారం కొనుక్కోవలసిన అవసరం లేకుండా పోయింది.

## కమ్యూనిటీ విత్తన బ్యాంకు – పునరుజ్జీవం

మన దేశంలోని చిన్న, సన్నకారు రైతన్నలకు నాణ్యమైన విత్తనాలు లభించవు. కారణం వారు సంప్రదాయక విత్తనోత్పత్తి విధానాలను ఇటీవల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. ప్రభుత్వం నుంచి లేదా మార్కెట్‌లో లభించే విత్తనాలపైనే ఆధారపడుతున్నారు. తాజాగా ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చి ఫౌండేషన్ ప్రారంభించిన ఏపీఎం ప్రాజెక్టు పేరుతో విత్తన బ్యాంకులను ప్రోత్సహించడంతో పరిస్థితిలో మార్పు వస్తున్నది. ఈ విత్తన బ్యాంకుల్లో మేలు రకపు వరి, జొన్న విత్తనాలు సమృద్ధిగా రైతులకు అందుబాటులో ఉంచడం సాధ్యమవుతోంది. విత్తన బ్యాంకులను రైతుల క్లబ్బుల ద్వారా కానీ, మహిళల స్వయంసహాయక బృందాల ద్వారా కానీ నిర్వహించడం జరుగుతోంది. ఈ రకంగా విత్తన బ్యాంకుల

> *అంతర పంటల సాగు రైతుల కుటుంబాలకు మరిన్ని పోషక విలువలతో కూడిన ఆహారం, అదనపు ఆదాయం, రైతుల పొలాలకు మరింత భూసారం సమృద్ధిగా సమకూరడమే కాక కరువుకాటకాల ప్రభావం బాగా తగ్గిపోయింది.*



*కసావా, ఉల్లి అంతర పంటలుగా సాగుచేయడంతో 60% అదనపు ఆదాయం సంపాదించుకున్న మహిళా రైతు*

ఫోటో: ఎస్. అబూబాకర్ సిద్దిక్ / ఎమ్.ఎస్.ఎస్.ఆర్.ఎఫ్.

నుంచి సేకరించిన విత్తనాలకు బదులుగా పంట దిగుబడికి చేతికి అందిన తర్వాత రెట్టింపు మొత్తం తిరిగి బ్యాంకులో జమ చేయవలసి ఉంటుంది. ఆ రకంగా ఈ విత్తన బ్యాంకులు ఎక్కువ కాలం ఇతర రైతన్నలకు ఉపయోగపడడం సాధ్యమవుతోంది. అదే సమయంలో రైతన్నలలోనే మరి కొందరిని మేలు రకం విత్తనాలను అభివృద్ధి చేసే కృషిలో భాగస్వాములు అయ్యే విధంగా ప్రోత్సహించడం నిర్విరామంగా కృషి సాగుతోంది. విత్తన బ్యాంకుల ఏర్పాటు వల్ల రైతులకు అవసరమైన సమయానికి మేలు జాతి విత్తనాలను సిద్ధంగా నిల్వ చేయగలుగుతున్నారు. ఇలా నిల్వ చేసిన వాటిలో రైతులు తమ తమ అవసరాలకు అనువైన విత్తన రకాలను ఎంపిక చేసుకునేందుకు వీలు కలుగుతోంది. వీటి వల్ల పంట విఫలమయ్యే ప్రమాదం తగ్గిపోతోంది. విత్తన బ్యాంకుల కారణంగా పరిసరాలలో సాగుచేసే పంటలలో వైవిధ్యం కనిపిస్తోంది. విభిన్నమైన పంటలను సాగు చేయడంలో మానవ సామర్థ్యం మెరుగుపడింది. ఆ రకంగా ఈ ప్రాంతాలలోని పేద ప్రజానీకానికి ఆహార భద్రత సమకూర్చడం సాధ్యమవుతోంది. సాగు కార్యకలాపాలు దీర్ఘకాలం కొనసాగించే అవకాశాలు మెరుగవుతున్నాయి.

## కంద సాగులో సానుకూల అంశాలు

కేరళలోని వైనాడ్‌లో రైతన్నలు సంప్రదాయకంగా కంద సేద్యం (ఎలిఫెంట్ యామ్) చేస్తున్నారు. వరి సాగుతో పాటు కంద సాగు చేస్తారు. ముఖ్యంగా వరి సాగు అనంతరం వృధాగా ఉన్న పొలంలో కంద సాగు జరుగుతుంది. వాళ్లు ఎప్పుడూ ఒకే రకం కంద విత్తనాలను ఉపయోగిస్తుంటారు. అందువల్ల వారికి కంది సాగు ఆర్థికంగా చాలా భారంగా ఉండేది. పెద్ద మొత్తం ఖర్చు చేయవలసి వచ్చేది. భాగస్వామ్య పద్ధతిని అనుసరించడం ప్రారంభించిన తర్వాత కొత్త రకం విత్తనాల రూపకల్పన, ఉత్తమ సేద్య విధానాల వినియోగించారు. ఫలితంగా ఖర్చులను తగ్గించుకునేందుకు శ్రద్ధ చూపించారు. విత్తనాలను తక్కువ వ్యవధిలోనే మొలకెత్తించేందుకు పంటల వ్యర్థాలను, కుళ్లిన పదార్థాలను ఉపయోగించడం ప్రారంభించారు. ఈ రెండు రకాలు మెరుగైన

దిగుబడినిస్తాయి. చీడపీడల బెడద తక్కువ. కరువు కాటకాలను తట్టుకోగలవు. మెరుగైన ఫలదీకరణ ప్రభావం వీటికి ఉన్నది. సాగు పద్ధతుల్లో మెరుగైన విధానాలు కూడా వారి ఖర్చుల భారం తగ్గించాయి. దిగుబడి పెరిగింది. ఉదాహరణకు వైనాడ్ సోకల్ సాగు చేస్తే దిగుబడి 30 శాతం, గజేంద్ర సాగు చేస్తే 24 శాతం దిగుబడి వచ్చింది. ఇవి సంప్రదాయక విత్తనాలతో సాగుచేసినప్పటి దిగుబడితో పోలిస్తే వచ్చిన ఫలితాలు.

కేరళలో సొంతంగా భూ వసతి ఉన్న రైతు మహిళలు, సన్నకారు రైతులు వరి సాగు సాగని ఆరు మాసాల వ్యవధిలో (అంటే డిసెంబర్ నుంచి జూన్ వరకు) కంద లేదా ఇతర స్వల్పకాలిక పంటలను అదనంగా పైసా ఖర్చు చేయకుండా సాగు చేయడానికి ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల వారికి కొన్ని ప్రయోజనాలు సమకూరుతున్నాయి. ముఖ్యంగా అంతకుముందు ఉపయోగించిన ఎరువుల ప్రభావం ఇప్పుడు ఈ స్వల్పకాలిక పంటల సాగులో తోడ్పడుతున్నాయి. అంతేకాక భూమిని దుక్కిదున్నడానికిసదుపాయంగానేలసిద్ధమవుతోంది.ఫలితంగా తదుపరి వరి సాగు సులభమవుతుంది. సొంతంగా భూమి లేని మహిళలు ఈ ఆరు మాసాలు ఆ భూములను ఉపయోగించి మేలు రకపు విత్తనాలను ఉపయోగించి కంద సాగు చేస్తుంటారు. ఇది వారికి ఆదాయ మార్గంగా మారుతోంది. ఈ విధంగా కంద సాగు ద్వారా భూమి లేని మహిళలకు ఆ ఆరు నెలల కాలంలో రూ.3000 నుంచి రూ.13000 వరకు ఆదాయం లభిస్తోంది. ఈ ఆరు మాసాలలోనే ఇతర స్వల్పకాలిక పంటలు... కౌ పీ, అమరాంథస్, ఓక్రా, మొక్క జొన్న (మైజ్), గుమ్మడి కాయలు, దోసకాయ వంటివి - సాగు చేస్తారు. వీటిలో ఎక్కువ భాగం రైతు కుటుంబాల స్వంత వినియోగానికే ఉపయోగిస్తారు.



ఫోటో: గిరిజన్ గోపి / ఎమ్.ఎస్.ఎస్.ఆర్.ఎఫ్.

## ముగింపు

భాగస్వామ్య పరిశోధనల ద్వారా వ్యవసాయదారులు కసావా పంటలు, కంద (ఎల్‌ఫెంట్ యామ్) సాగుకు సంబంధించి మేలు రకపు విత్తనాలను వృద్ధి చేసుకోగలిగారు. అదనపు దిగుబడి, మరింత రాబడి సాధించుకోగలిగారు. అంతర పంటల సాగు విధానం అనుసరించడం ద్వారా కలిగే ప్రయోజనాలను గుర్తించి వాటిని అనుసరించడం ప్రారంభించారు. ఫలితంగా వారి ఆహారంలో వివిధ పోషక విలువలు భాగమయ్యాయి. రైతుల క్లబ్బులు, మహిళల స్వయంసహాయక బృందాల నిర్వహణలోని విత్తన బ్యాంకులు వ్యవసాయంలో వైవిధ్యానికి చోటు చూపించాయి. చిన్న, సన్నకారు రైతులకు కరువు కాటకాల పీడను తట్టుకోగల సామర్థ్యం వారికి సమకూరింది. మహిళా రైతులు, సన్నకారు రైతు కుటుంబాలకు ఉత్తమ సాగు విధానాలు, మేలు రకం విత్తనాలు అందుబాటులోకి రావడంతో వారి జీవనోపాధులకు గట్టి భరోసా దక్కింది.

## అభినందనలు

వ్యాస రచనకు సహకరించిన జే. జయకుమార్, జి.వెంకటేశన్, పి.యువరాజ్, వి. చేలాదురై (వీళ్లంతా ఎంఎస్ఎస్ఆర్ఎఫ్, కొల్లీ హిల్స్‌కు చెందినవారు), రాజీస్ పీసీ, అరుణ్ రాజ్, సుబిన్, శ్రీమతి అసియా (వీళ్లు ఎంఎస్ఎస్ఆర్ఎఫ్, వైనాడుకు చెందినవారు), స్టార్ ఫార్మర్స్ క్లబ్, కీల్ సంగాడు (కొల్లీ హిల్స్), ఏపీఎం కసావా ఫార్మర్స్ రీసెర్చి గ్రూపు (కొల్లీ హిల్స్) వారికీ ప్రత్యేక అభినందనలు.

(స్టోరీస్ అఫ్ ఛేంజ్ సీరీస్‌లో భాగంగా ప్రచురితమైన విస్తృత వ్యాసానికి ఇది సంక్షిప్త రూపం. దీనిని సమీకృత వ్యవసాయం దిగుబడిని, జీవనోపాధులను పెంపొందించడంతో పాటు వ్యవసాయ వైవిధ్యానికి తోడ్పడుతుంది అనేది ఆ విస్తృత వ్యాస రూపానికి ఇచ్చిన శీర్షిక. ఈ వ్యాస పరంపరను విస్తృతంగా ప్రచారం చేయడంలో కెనడాకు చెందిన ఇంటర్నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ రీసెర్చి ఫండ్ (సీఐఎఫ్ఎస్ఆర్ఎఫ్), కెనడా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ రీసెర్చి సెంటర్ (ఐడీఆర్‌సీ) ఆధ్వర్యంలో కెనడా ప్రభుత్వ ఆర్థిక సహకారంతో గ్లోబల్ ఎఫైర్స్ కెనడా పర్యవేక్షణలో 2014లో రెన్ మీడియా సంస్థ కృషిసాగించింది. ◆

**EDI Oliver King**
M.S. Swamynathan Research Foundation
3 Cross Street, Institutional Area,
Taramani, Chennai - 600 113, India
E-mail : ediok151173@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 18, సంచిక 2, జూన్ 2016.

# పర్యావరణ-సేద్య సమాచార మార్పిడి

## ఆచరణకు దారి చూపిస్తుందా?

**టి.ఎం. రాధా**

**పర్యావరణహిత సేద్యం అనుసరించడం ద్వారా రైతన్నలకు ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా వారు నిత్యం వ్యవసాయ కార్యకలాపాలలో అనుసరించే విధానాల నుంచి పరిస్థితులు, వనరులు, పరిజ్ఞానానికి అనుగుణంగా స్వీయ అనుభవాల ప్రాతిపదికగా సమస్యలకు పరిష్కారం కనుగొనటం సాధ్యమవుతుంది. సాధారణంగా వ్యవసాయ రంగంలో రైతులు తమ అనుభవాలను మెరుగుపరచుకోవడంతో పాటు నైపుణ్యం పెంచుకోవడం పర్యావరణ సేద్యంలోని కీలక అంశంగా చెప్పుకోవాలి.**

దేశంలో పర్యావరణపరంగా శ్రేయోదాయకమైన వ్యవసాయ విప్లవం ఎనభైవ దశకంలో ప్రారంభమైంది. సంప్రదాయక, రసాయనాల ఆధారిత వ్యవసాయం నిరాశ మిగల్చడంతో కొద్ది మంది రైతన్నలు ప్రత్యామ్నాయ సేద్య విధానాల బాట పట్టారు. భూసారం త్వరిత గతిన క్షీణించిపోకుండా కాపాడుకుంటూనే ఎక్కువ దిగుబడి ఇచ్చే విధానాలను అవలంభించారు. ఈ క్రమంలో భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరులను సురక్షితంగా అందజేశారు. వారికి తగిన భద్రతనిచ్చారు. పర్యావరణ సేద్యం అటువంటి ప్రకృతిహితమైన సేద్య విధానమే వేర్వేరు పేర్లతో - సుస్థిరమైన వ్యవసాయం, పర్యావరణ వ్యవసాయం, తేలికపాటి బాహ్య పరికరాల అవసరం లేని సేద్యం, లేదా ప్రజా భాగస్వామ్య వ్యవసాయం - వ్యవహరిస్తారు.

ఈ విధమైన సేద్య విధానం వాస్తవానికి వ్యవసాయ క్షేత్రంలోనే రూపుదిద్దుకుంది. ఈ రకమైన సేద్య విధానం అనుసరించడంలో రైతు సోదరులు ముందుగా తమ పంటల గురించిన పరిశీలన, అధ్యయనం చేశారు. అందులోంచే సరికొత్త విధానాలను గుర్తించి నూతన ఆవిష్కరణలకు తెరతీశారు. స్థానిక పరిస్థితులు, వనరులు, స్వీయ అనుభవం ప్రాతిపదికగా వారు తమ సమస్యలన్నిటికీ పరిష్కారాలను ఎంపికచేసుకున్నారు. ఈ కారణంగానే పర్యావరణ-సేద్యంలో అనుసరించే విధానాలు ప్రతీ ఒక్కరూ గుడ్డిగా అనుసరించే అవకాశం ఉండవు. ఒక్కో రైతు తన క్షేత్రంలో తనకు ఏది ఎక్కువగా ప్రయోజనకరమో గుర్తించి అందుకు అనుగుణంగానే విధానాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. సంప్రదాయక సేద్యంలో ఇందుకు భిన్నంగా ప్రతి ఒక్కరూ ఏక రూపక విధానాలు పాటించే అవకాశం ఉంటుందని మన అందరికీ తెలిసిందే. పర్యావరణ సేద్యంలో వ్యవసాయదారులు నిరంతరం తాము అనుసరించే విధానాలను, పద్ధతులను మెరుగుపరుచుకోవడంపైనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తూ ఉంటారు.

ఇలా తమ అనుభవసారం పెంచుకొనే ప్రయత్నంలోనే తగిన నైపుణ్యాన్ని, అవకాశాలను అందిపుచ్చుకుంటారు. వాటి గురించి తమలాంటి ఆలోచనలతోనే ఉన్న ఇతర రైతులకు ఇచ్చి పుచ్చుకోవడం సర్వసాధారణం. తాము తెలుసుకున్న ప్రయోజనకరమైన విధివిధానాలను గురించి పరస్పరం అందించుకోవడం ద్వారానే వారి సేద్య విధానాల నైపుణ్యం మరింత మెరుగుపడుతుంది. సభ్య సమాజాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతుల సమావేశాలు, రైతుల మధ్య అనుభవాల పరస్పర మార్పిడి అవకాశాలు, అభిప్రాయ మార్పిడి వేదికలు ఈ పరిజ్ఞానం వెల్లడించుకునేందుకు తోడ్పడుతుంటాయి. అవి అప్పుడప్పుడు మాత్రమే వారికి అందుబాటులో ఉంటాయి. ఈ విధంగా భావవ్యక్తీకరణకు సిద్ధం చేస్తున్న వేదికలు ఆశించిన ప్రయోజనాలు అయితే లభిస్తున్నాయి. ఈ కృషిలో కీలక బాధ్యతలను లీసా ఇండియా ఇనీషియేటివ్ సంస్థ నిర్వహిస్తోంది. సేద్య పరిజ్ఞానం విస్తృతంగా రైతు సోదరుల ముందుకు చేర్చడమే లక్ష్యంగా కృషి చేస్తున్న లీసా ఇండియా ఇనీషియేటివ్ సంస్థ 2000 వ సంవత్సరం నుంచి పర్యావరణహిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మేగజైన్ పాఠకుల నుంచి సేకరించిన అభిప్రాయాలు ఆధారంగా పర్యావరణసేద్య విధానాల ఆమోదం, అనుసరణలపై ప్రత్యేకంగా అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనం 2009 నుంచి సాగుతోంది.

## విధివిధానాలు

రైతుల మధ్య నిర్వహిస్తున్న ఈ అనుభవ మార్పిడి ప్రక్రియ ప్రారంభించి దశాబ్దకాలం దాటిపోయింది. ఫలితాలను విశ్లేషించే ప్రయత్నం కూడా నిరాఘాటంగా సాగిపోయింది. రైతుల నుంచి అభిప్రాయాలను సమీకరించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రయత్నాన్ని - ప్రయోజన ప్రభావం(స్ఫియర్ ఆఫ్ కంట్రోల్) - పేరుతో లీసా ఆచరణ విధానాలుగా ప్రచారం చేయడంపై దృష్టి కేంద్రీకరించడం జరిగింది. అనుసరించడానికి అనువైన ఉత్తమ పద్ధతులను అందరికీ తెలియజేయడంలో అనుసరించవలసిన - ప్రభావ విస్తృతి ( స్ఫియర్ ఆఫ్ ఇన్ ఫ్లుయెన్స్) పరిమితిని నిర్దేశించడం జరిగింది. అనంతరం ఈ విధానాలు చిన్న స్థాయి రైతన్నకు ఏ మేరకు ఉపయోగపడతాయో అంచనా వేసేందుకు ప్రయోజనాల పరిధిని (స్ఫియర్ ఆఫ్ ఇంటరెస్ట్) నిర్ణయించే

విషయాన్ని పరిశీలించడం జరిగింది. ఈ మొత్తం అధ్యయనం జరిపేందుకు రకరకాలైన పాఠకుల అభిప్రాయ సేకరణ పద్ధతులను అనుసరించవలసి వచ్చింది. ఉదాహరణకు పాఠకుల అభిప్రాయాల సేకరణ, బృందాలవారీ చర్చలు, వ్యక్తులను విడివిడిగా కలుసుకోవడం, క్షేత్ర సందర్శనలు, ప్రత్యేకంగా నిర్వహించిన వర్క్ షాపులు ఏర్పాటుచేయవలసి వచ్చింది. ప్రస్తుతం ప్రభావ విస్తృతి (స్ఫియర్ ఆఫ్ ఇన్ ఫ్లుయెన్స్) గురించి ఇక్కడ తెలుసుకుందాం. పర్యావరణ హితమైన సేద్య విధానం ఏ విధంగా విభిన్నమైన ఆలోచనా ధోరణులు కల పాఠకులను లేదా వ్యవసాయదారులను ఆకట్టుకోగలిగిందో, వారి సేద్య విధానాలలో ఎలాంటి మార్పులకు తోడ్పడిందో తెలుసుకునేందుకు చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

పాఠకులపై నిర్వహించిన సర్వేలో దాదాపు 1500 మంది పాల్గొన్నారు. 21 మందితో విస్తృతంగా మాట్లాడడం జరిగింది. వారిలో ఎనిమిది మంది వ్యవసాయ రంగానికి చెందినవారే. వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు ఏడుగురి అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగింది. ముగ్గురు మీడియాకు చెందిన వారు. ప్రభుత్వం నుంచి ఒకరు, రీసెర్చి ఇనిస్టిట్యూషన్ నుంచి ఒకరు, రుణపరపతి సంస్థ తరుపున ఒకరు వారి అభిప్రాయాలు తెలియజేశారు. ఒక రకంగా లీసా మేగజైన్ లోని సమాచారాన్ని వారు ఎలా ఉపయోగించుకున్నారో, వాటి ఫలితాలు, ప్రయోజనాలు ఏమిటో వారి ద్వారా తెలిసింది. వాళ్లందరినీ బృందాలుగా ఏర్పాటుచేసి గోష్ఠులను కూడా నిర్వహించి వారి వారి అనుభవాలను, అభిప్రాయాలను సేకరించారు. లీసా ఇండియా పాఠకులను 50 నుంచి 60 మందిని ఒక బృందంగా ఏర్పాటు చేయడం జరిగింది. వాటిలో వ్యవసాయ శాస్త్రాల విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్), ఉద్యానవనాల పరిశోధనా కేంద్రం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ రీసెర్చి), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు, స్థానిక ఆరోగ్య సంరక్షణ విధానాల పునరుద్ధరణ సంస్థ (Foundation for Revitalisation of Local Health Traditions (FRLTH)), ఇంకా ఇలాంటి వ్యవసాయదారుల ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న స్పెయిన్ సంస్థ గ్రామీణ అభివృద్ధి ట్రస్టు (Rural Development Trust (RDT)) ప్రతినిధులను కూడా జతచేయడం జరిగింది. ఈ మేగజైన్ పాఠకులలో స్వయంగా సేద్యం చేస్తున్న నలుగురు రైతు సోదరులకు క్షేత్రస్థాయి పర్యటనలకు ఎంపిక చేయడం జరిగింది. వారి నుంచి మేగజైన్‌లో సూచించిన విధానాలను అమలు చేయడంలో వారి అనుభవాలను సేకరించేందుకు కృషి జరిగింది. క్షేత్ర పర్యటనల్లో పాల్గొన్న నలుగురు పాఠక వ్యవసాయదారులలో ముగ్గురు కేవలం రెండు నుంచి మూడు ఎకరాల పొలం మాత్రమే ఉన్న చిన్నకారు రైతన్నలు. ఇక నాలుగో రైతు మాత్రం దాదాపు 15 ఎకరాలకు ఆసామీ. ప్రభావ విస్తృతి (స్ఫియర్ ఆఫ్ ఇన్ ఫ్లుయెన్స్)

మేగజైన్ అందిస్తున్న సమాచారం ఆధారంగా - రైతులు ఎలా తమ వ్యవసాయపు పనులను నిర్వహిస్తున్నారు, వాటి ఫలితాలేమిటి, వాటి కారణంగా వారిలో ఆలోచనలపరంగా కానీ, పని నైపుణ్యం విషయంలో కానీ, ఆచరించడంలో కానీ - అన్న విషయాలను అధ్యయనం చేయడం జరిగింది. ఈ అధ్యయనంలో ప్రయోజనాలు, వారి ఆలోచనలపై ప్రభావం వంటివి పరిశీలించడం జరిగింది. ఎంపిక చేసిన పాఠక కర్షకుల నుంచి వ్యక్తిగతమైన అభిప్రాయాలను సమీకరించడం జరిగింది.

## విభిన్నమైన ఆలోచనలకు ఆస్కారం

పరస్పరం సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా, పర్యావరణ సేద్య కార్యకలాపాలను నిర్వహించడంలోనూ, ఆలోచనా ధోరణిలోనూ, వారి దృక్పథంలోనూ గణనీయమైన మార్పులు కనిపించాయి. ఈ మార్పు కేవలం రైతులలో మాత్రమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ఔత్సాహికులలోనూ కూడా కనిపించింది. ఉదాహరణకు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతుల విషయమే తీసుకుంటే -వారికి తాము అనుసరిస్తున్న జీవనోపాధి అంటే వ్యవసాయంపై విశ్వాసం, నమ్మకం మరింతగా పెరిగాయి. ప్రత్యామ్నాయాలు కనిపించాయి. విశాలమైన ఈ ప్రపంచంలో తమలాంటి వాళ్లు మరెందరో ఉన్నారనే వాస్తవికత గుర్తింపునకు వచ్చింది. ఇలాంటి వాళ్లకి లీసా మేగజైన్ ఆశావహమైన భవిష్యత్తును చూపించింది. ఫలితంగా వాళ్లంతా తమ జీవనోపాధి అయిన వ్యవసాయ కార్యకలాపాలను మరింత ఉత్సాహంగా, విశ్వాసంతో కొనసాగించగలిగారు.

మరోవైపున - ఆచరణసాధ్యమైన పర్యావరణ సేద్యం చేపట్టినందువల్ల వారి చుట్టూ ఉన్న మొత్తం రైతాంగం అభివృద్ధి పథంలో ముందుడుగులు వేయగలిగారు. జీవనోపాధుల్లో ప్రత్యామ్నాయాలు కనిపించడంతో ఆర్థికంగానూ, ఇతరత్రా కూడా పురోగతి సాధించారు. ఇంతవరకు వారు అదనపు ఆదాయం కోసం అంతగా ప్రయోజనం లేని మార్గాలనే అనుసరించేవారు. ఆ క్రమంలో సురక్షితమైన వ్యవసాయం చేసే మార్గాలను వారు గుర్తించలేకపోయేవారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలను గురించి సమాచారం తెలియడంతో గ్రామీణ ప్రజానీకం కొత్తగా చేపట్టిన విధానాలు ఎంత ఉపయోగకరంగా ఉండేవో తెలుసుకున్నారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిలో దాదాపు 74 శాతం తమకు ఇప్పుడు ప్రత్యామ్నాయాల విషయంలోనూ, పర్యావరణ సేద్యంపైన మరింత మెరుగైన స్పష్టత ఏర్పడిందని అంగీకరించారు. వారికి విషయంలో శ్రీ వరి సేద్యం, ఐపీఎం సేద్యం విధానాలతో పాటు సజీవమైన పంట పొలాల గురించిన అవగాహన మెరుగుపడింది.

## సొంత భూముల్లోనే ప్రయోగాలు

ఆలోచనల్లో వచ్చిన మార్పులు ఆచరణలో కూడా చోటు

సంపాదించుకున్నాయి. పంటల సాగు విధానాల్లోనూ మార్పులకు దారితీసింది. కొత్త కొత్త ఆలోచనలను, నూతన విధానాలను అనుసరిస్తూ మెరుగైన ఫలితాల అన్వేషణ ప్రారంభించారు. ఈ మార్పులు వారి పంట చేలను చూడగానే మనం గుర్తించవచ్చు. దాదాపు 58 శాతం మంది తమకు తెలిసిన కొత్త విధానాలను పొలాల్లో ఉపయోగించారు. సేంద్రీయ ఎరువులను ఉపయోగించడం, కంపోస్టు, వెర్మిపోస్టు, అజోలా వంటి ఎరువులను వాడడం మొదలు పెట్టారు. ఉదాహరణకు, షిమోగా జిల్లాలోని ఒక రైతు తన పొలంలో ఎత్తు పెంచిన నేలల్లో వరి సాగు చేపట్టాడు. ఆయనకు ఈవిషయంలో ప్రత్యేకంగా వరి సాగు కోసం పంట పొలం ఎత్తును పెంచడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రోత్సహించిన వ్యాసం ఆయనకు స్ఫూర్తినిచ్చింది. ఈ విధానం కారణంగాసాగు వ్యయం సగానికి సగం తగ్గిపోయిందని చెప్పారు. అంటే ఆయనకు వచ్చిన లాభంలో 50 శాతం పెరిగిందన్నమాట. మరో విషయం కూడా మనం గమనించవచ్చు. చాలా మంది రైతన్నలు ఇప్పుడు రసాయనాల వాడకాన్ని చాలా వరకు తగ్గించివేశారు. పంట పొలాల్లో లభించే వ్యర్థాలు ఉపయోగించుకుని సేంద్రీయ ఎరువులను తయారుచేసుకుంటున్నారు. ఈ జిల్లాలోని కొందరు సేంద్రీయ ఎరువులతో పాటు సాగు నీటిని జత చేసి పొలాలకు పుష్టిని, మరింత శక్తిని సమకూర్చుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల పొలానికి సేంద్రీయ ఎరువులను జతపరచే పనుల కోసం కార్మిక శక్తి పేరుతో అయ్యే ఖర్చు బాగా తగ్గిపోయింది. కొందరు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. వారు స్వయంగా ఎరువుల తయారీకి ఉపయోగపడే సేంద్రీయ వ్యర్థాలను అందించే పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆ విధంగా విడిగా సేంద్రీయ ఎరువులను అదనంగా పొలాలకు జత చేయవలసిన అవసరాన్ని తప్పించుకుంటున్నారు. షిమోగా జిల్లాకు చెందిన యువ రైతు నందీశ్ ఇలాంటి రకరకాల పంటల సాగును చేపట్టి సజీవమైన మొక్కల పెంపకం ద్వారానే పొలానికి అవసరమైన సేంద్రీయ ఎరువులను సమకూర్చుకో గలుగుతున్నాడు.

## ఇతరులకు ఆదర్శంగా....

పర్యావరణ సేద్య విధానాలపై పెరిగిన అవగాహనతో పరిసర ప్రాంతాలలోని ఇతర రైతన్నలకు కూడా పర్యావరణ హితమైన వాతావరణాన్నిఅందించగలుగుతున్నారు. వారి ప్రయత్నాలు, ఫలితాలపై జరిపిన అధ్యయనంలో తేలిన మరో విషయం ఏమిటంటే దాదాపు 39 శాతం స్వచ్ఛంద సంస్థలు తమ పరిధిలోని వ్యవసాయదారులు వర్మి కంపోస్టు, సజీవ ఎరువులు, శ్రీ సేద్యం వంటి విధానాలను అనుసరించేందుకు ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరాఖండ్ లోని మారు మూల గ్రామమైన అకోటం లో వర్మికంపోస్టు తయారీని సామాజిక బాధ్యతగా అక్కడి రైతన్నలకు అప్పగించడం జరిగింది. ఇందుకు లీసా మేగజైన్ ప్రచురించిన వ్యాసమే స్ఫూర్తినిచ్చింది. అందులో సూచించిన విధంగా పశువులకు దాణాగా ఉపయోగపడే అజోలా సాగును మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలలో ని పాడి పరిశ్రమలో ప్రవేశపెట్టారు. మంచి ఫలితాలు సాధిస్తున్నారు. వ్యవసాయ సంబంధ అభివృద్ధి కార్యక్రమాలను గురించి సలహా సూచనలిచ్చే సచిన్ సురేశ్ లీసా మేగజైన్ అందించిన ఒక వ్యాసం ప్రేరణతో పీతల పెంపకంలో పెరిగే గుందీ అనే పురుగుల వృద్ధికి ఇతర రైతులకు మార్గదర్శకం చేశాడు. ఈ గుందీ పురుగులు ( ఒక రకం వానపాములు) వ్యవసాయదారులకు చాలా ఉపయోగపడతాయి. అదే విధంగా తమిళనాడులో వ్యవసాయ దారులకు సలహాలు ఇస్తున్న సీడ్స్ అనే సంస్థ అజోలా, వర్మి కంపోస్టు అభివృద్ధికి తోడ్పడుతోంది. మేగజైన్ ప్రేరణతో మొదట్లో నలుగురైదుగురు రైతులు మాత్రమే ఈ దిశగా దృష్టి పెట్టారు. ఇప్పుడు చాలా మంది అదే బాట పట్టారు.

పర్యావరణ సేద్యం గురించిన సమాచారాన్ని శాస్త్ర పరిశోధకులు మరో విధంగా ఉపయోగించుకున్నారు. నిజానికి వారు కూడా ఈ సమాచారాన్ని ఆచరణలోకి తీసుకువచ్చి సత్ఫలితాలను సాధించారు. ఉదాహరణకు, నీటి పారుదల సదుపాయాలు అంతంత మాత్రంగా  ఉండే మెట్ట ప్రాంతాలలో సేంద్రీయ సేద్యాన్ని ఒక నమూనాగా ప్రవేపెట్టారు. భూసార సంరక్షణ గురించిన సమాచారంపైనా, ఆచరణాత్మక ఉత్పాదన సమర్థవంతమైన నిర్వహణ గురించికేంద్ర మెట్ట ప్రాంతాల వ్యవసాయ పరిశోధన సంస్థ (సీఏజెడ్ఆర్ఐ) ఒక నమూనాను తయారు చేసారు. స్థానిక స్థాయిలో వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలను పర్యవేక్షించే కృషి విజ్ఞాన్ కేంద్రాలు కూడా ఈ మేగజైన్ ఆధారంగా కొత్త కొత్త ఆలోచనలు చేస్తున్నారు. ఉదాహరణగా చెప్పాలంటే పశ్చిమ బెంగాల్ లోని సేంద్రీయ పత్తి మార్కెటింగ్ పై (ఎంటర్ ప్రైజెస్ పర్ ఫార్మెన్స్ మేనేజ్ మెంట్) దృష్టి పెట్టాయి.

ఆలోచనల్లో, ఆచరణలో కొత్తదనం ఇటీవల కాలంలో వ్యవసాయ నిపుణులు ప్రజా ప్రయోజనాల ప్రాతిపదిక మీద, స్థానిక అవసరాల ఆధారంగానూ, సంప్రదాయ విధానాల మీద దృష్టి కేంద్రీకరించి తమ పరిశోధనలను చేపడుతున్నారు. ఈ లక్ష్యంతో వ్యవసాయదారులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారికి ఉపయోగకరమైన సేద్య పద్ధతులకు రూపకల్పన చేస్తున్నారు. ముఖ్యంగా భాగస్వామ్య సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి (పార్టిసిపేటరీ టెక్నికల్ డెవలప్ మెంట్), వ్యవసాయదారుల క్షేత్రస్థాయి బోధన (ఫార్మర్స్ ఫీల్డ్ స్కూల్స్) పై వారు పరిశోధనలు చేపట్టారు. ఇందుకు మేగజైన్ లోని వ్యాసాలే స్ఫూర్తినిచ్చాయి. ఇందుకు తమిళనాడులోని కోయంబత్తూర్ లోని చెరకు పరిశోధనా కేంద్రం (సుగర్ క్రేన్ బ్రీడింగ్ ఇనిస్టిట్యూట్) ఒక ప్రయత్నం చేసింది. ఒక చక్కెర ఫ్యాక్టరీ పరిధిలో వేర్వేరు రకాలైన విధానాలను ప్రోత్సహించింది. ఫలితంగా ఆ ఫ్యాక్టరీ మూసివేత ప్రమాదంనుంచి బయటపడింది. ఇదే విధంగా చాలా మంది పాఠకులు / స్వచ్ఛంద సంస్థలు

వ్యవసాయదారుల శిక్షణపై ఆసక్తి పెంచుకున్నాయి. తమ వ్యవసాయ క్షేత్రాలలో తమకు అవసరమైన తీరులో ఉపయోగించుకున్నాయి.

ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాల కోసం చాలా మంది శాస్త్రవేత్తలు, విద్యావంతులు కూడా లీసా ఇండియా సంస్థ ప్రచురిస్తున్న మేగజైన్ లో లభించే సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు. వారికి ఈ మేగజైన్ ద్వారా విజ్ఞానం పెంపొందడమే కాకుండా వారి పరిశోధనల్లో కొత్త ఆలోచనలకు మార్గం లభిస్తోంది. ఇప్పటికే ప్రారంభమైన కొన్ని పరిశోధనల్లోనూ, పీహెచ్‌డీ అధ్యయనాలలోనూ ఈ వ్యాసాలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. కొత్త ప్రాజెక్టులకు అవసరమైన ఆలోచనలకు కూడా ఇవి స్ఫూర్తినిస్తున్నాయి.

సంస్థాగతంగా మెరుగైన వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావటంలో కూడా మేగజైన్ తోడ్పడుతోంది. ఉదాహరణకు ఉత్పత్తిదారుల కంపెనీ ఏర్పాటుకు మేగజైన్ లోని సారాంశమే మార్గం చూపింది. కేరళలోని అట్టపడి ప్రాంతంలోని రైతన్నలు సంఘటితమై స్వచ్ఛంద సంస్థ అయిన అహాడ్స్ (అట్టపడ్డి హిల్ డెవలప్ మెంట్ సొసైటీ) సాయంతో ఫార్మా అనే కంపెనీని ఏర్పాటు చేసుకున్నారు. ఫెయిర్ ట్రేడ్ విషయంపై వ్యాస రచయితను ఈ సంస్థ సంప్రదించింది. రైతన్నలను సంఘటిత పరచడంపై వారి సూచనలను ఆదారం చేసుకునే ఫార్మా ఏర్పాటుకు ముందుకొచ్చింది.

మేగజైన్‌లో వచ్చే సమాచారం ఆధారం చేసుకునే చాలా మంది తమ వ్యవసాయ క్షేత్రాలలో తాము చేపట్టె కార్యక్రమాలను మరింతగా మెరుగుపరచుకున్నారు. చాలా స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలలో మేగజైన్ లోని సమాచారాన్ని కూడా ఉపయోగించుకుంటూ వచ్చాయి. ఈ సమాచారం ఆధారంగా తాము ఆశించి మార్పులను తీసుకురావచ్చుననే గట్టి నమ్మకం వారిలో ప్రబలంగా కనిపిస్తుంది. పైగా ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాల గురించి ప్రత్యేకంగా తమ శిక్షణలో చోటు ఇచ్చేందుకు అవసరమైన సమాచారం వారి దగ్గర లేకపోవడంతో వారు మేగజైన్ పైనే ఆధారపడకతప్పేది కాదు. ఇందుకోసం కూడా వారికి లీసా మేగజైన్ సహాయపడుతూ వచ్చింది. ఈ మేగజైన్ సమాచారం ఆధారంగానే రైతులకు ఇచ్చే శిక్షణలో సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించేందుకు కావల్సిన పాఠ్య అంశాన్ని కూడా మేగజైన్ లోని సమాచారం ఆధారంగానే రూపొందించారు.

## ప్రధాన స్రవంతిలో భాగంగా...

లీసా ఇండియా మేగజైన్ లోని సమాచారాన్ని ఆధారం చేసుకుని వ్యవసాయదారులకు ఉపయోగకరమైన ప్రదర్శనలను పరిశోధనా సంస్థలు రూపొందించాయి. పరిశోధనా అంశాలను ఎంపిక చేసుకున్నారు. ఉదాహరణకు వాతావరణ మార్పులకు సంబంధించిన పరిశోధనాంశాన్ని మేగజైన్ లోని సమాచారం

లీసా ఇండియా నుంచి ఆవిష్కృతమైన ముఖ్యమైన మార్పులలో ఒకటి - వరి ఉత్పత్తి విధానాలలో ప్రవేశపెట్టిన విధానాలు. శ్రీ వరి సాగు (సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్) విధానం రూపొందించి అమలు చేయడంలో లీసా చాలా సంవత్సరాలుగా ఆదర్శంగా నిలుస్తోంది. చాలా మంది రైతన్నలకు శ్రీ వరి సాగులో లీసా ఇండియా నుంచి లభించే సమాచారమే కీలకంగా ఉంటూ వచ్చింది. వారు స్వయంగా తమ పంట పొలాల్లో శ్రీ వరి సాగును చేపట్టారు. లేదా ఇతర రైతన్నలను ప్రోత్సహించి శ్రీ వరి సాగు చేపట్టేందుకు తోడ్పడ్డారు. ఉదాహరణకు ఒరిస్సాకు చెందిన ప్రదీప్ కుమార్ తన రాష్ట్రంలో సుమారు వెయ్యి మంది శ్రీ వరి సాగును చేపట్టేందుకు ప్రోత్సాహం అందించారు. ఆ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పారు. అందుకు తనకు మేగజైన్ లోని సమాచారమే స్ఫూర్తినిచ్చిందని ఆయన తెలిపారు. నిజానికి ఆయన చొరవ తీసుకున్న తర్వాతనే అక్కడి ప్రభుత్వం కూడా శ్రీ వరి సాగును ప్రోత్సహించడం ప్రారంభించింది.

సహాయంతోనే ఎంపిక చేసుకున్నారు. ఉద్యానవనాల పరిశోధనా కేంద్రం రూ.9 లక్షలు ఖర్చు అయ్యే పారా-ఏజెంట్ల గురించి అధ్యయనం చేపట్టింది. దీనికి మేగజైన్ లో వచ్చిన వ్యాసమే ప్రేరణగా నిలిచింది. అదే విధంగా, భూసార పునరుద్ధరణకు సంబంధించి మేగజైన్‌లో వచ్చిన వ్యాసం ఆధారం చేసుకునే అనుకూలమైన రీతిలో మైక్రోబ్స్ సమూహాన్ని గుర్తించేందుకు ఈ కేంద్రం రెండు ప్రతిపాదనలను పరిశీలనకు స్వీకరించింది.

విజ్ఞానవేత్తలు లీసా ఇండియా మేగజైన్ లోని సమాచారాన్నే ఉపయోగించి ఇతరులకు శిక్షణ ఇస్తున్నారు. సుస్థిర వ్యవసాయం, సుస్థిర అభివృద్ధి, సేంద్రీయ సాగు విధానాలు, వ్యవసాయ క్షేత్రాల సక్రమ నిర్వహణ, భూసార రక్షణ, నీటి సద్వినియోగం, క్రిమికీటకాలకు పర్యావరణకు ఉన్న సంబంధాలు వంటి వాటి గురించి పాఠ్యప్రణాళికలలో చోటు కల్పించారు. ప్రత్యేక కోర్సులను నిర్వహించారు. తమిళనాడులోని గాంధీగ్రామ్ రూరల్ యూనివర్సిటీ నిర్వహించే బోధనా కార్యక్రమాలలో లీసా సంస్థకు ప్రాధాన్యం ఇచ్చింది.

మూడేళ్లకోసారి బోధనాంశాలను మెరుగుచేసే సమయంలో మేగజైన్‌లో లభించే సమాచారానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు. వ్యవసాయ విస్తరణకు సంబంధించిన ప్రాథమిక శిక్షణలో మేగజైన్ సమాచారానికి తగిన ప్రాధాన్యతనిచ్చారు. తాజాగా వాతావరణ మార్పులపై మేగజైన్ ప్రచురించిన సమాచారం ఆధారంగా వాటిపై ప్రత్యేకంగా ఒక అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉంది. ఇలా వివిధ వర్గాల నుంచి అందుతున్న ప్రోత్సాహం గమనిస్తే, సుస్థిర వ్యవసాయం ప్రతిపాదనకు స్రవంతిలో ఆలోచనల పరంగానూ, ఆచరణాత్మకంగానూ ప్రాముఖ్యత గణనీయంగా పెరుగుతున్నట్టు

స్పష్టమవుతుంది. అందుకు ఆయా సంస్థల ప్రాధాన్యతల్లో కానీ, ప్రణాళికలలో కానీ వచ్చిన మార్పులు కారణం కావచ్చు. లేదా అది కేవలం కొద్ది మంది వ్యక్తుల అత్యుత్సాహం కావచ్చు.
విస్తృతంగా జరుగుతున్న ప్రచారం

మేగజైన్ ద్వారా లీసా ఇండియా అందిస్తున్న సమాచారం కేవలం రైతన్నల వరకు మాత్రమే కాకుండా ఆసక్తి గల అన్ని వర్గాల వారికి చేరేందుకు వీలుగా అన్ని వైపులా విస్తృతంగా ప్రచారమవుతోంది. ఈ విషయంలో పాఠకులుగా ఉన్న వ్యవసాయదారులే ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయం గురించిన సమాచారాన్ని ఈ పాఠక రైతన్నలే విస్తృతంగా తమ రైతు సమాజంలో ఇతరులకు పరిచయం చేస్తున్నారు. వారిలో దాదాపు 54 శాతం మంది ఇలా పరస్పరం సమాచారం ఇచ్చి పుచ్చుకుంటుండగా, 41 శాతం మంది వర్క్ షాపుల్లోనూ, సమావేశాలలోను ఇతరులకు తెలియజేస్తున్నారు. ఇక 53 శాతం మంది తమకు వృత్తిపరంగా సహాయసహకారాలు అందిస్తున్న నిపుణులతో సంప్రదించి మంచిచెడులను బేరీజు వేసుకుంటున్నారు. ఇక ఔత్సాహికులు, పరిశోధకులు, విద్యార్థులు తాము పాల్గొనే వివిధ రకాలైన సమావేశాలు, వర్క్ షాపులను లీసా మేగజైన్ అందించే సమాచారాన్ని ఇతరులకు తెలియజేసేందుకు వేదికలుగా ఉపయోగించుకుంటున్నారు. వ్యవసాయానికి సంబందించి ఎక్కడ ఏ రకంగా ఏ కొద్ది మంది కలిసినా వారి మధ్య తప్పనిసరిగా లీసా మేగజైన్ సమాచారం ప్రస్తావన వస్తూనే ఉంటుంది. ఉపయోగపడుతూనే ఉంటుంది. లీసా మేగజైన్ లో కనిపించే సమాచారంతో పాటు వాటిలో ప్రస్తావనకు వచ్చే ఇతర పుస్తకాలు, ఇతర మూల సమాచారం కూడా వారికి ఉపయోగపడుతోంది.

లీసా మేగజైన్ ఆధారంగా సేద్య విధానాలపై మాత్రమే కాకుండా సమీకృత విధానాల ప్రయోజనాలపై కూడా ప్రగాఢమైన నమ్మకం రైతన్నల్లో క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో వారు సంప్రదాయక విధానాలలో అవసరమైన మార్పులను కూడా పాటించేందుకు వెనుకాడడం లేదు. ముఖ్యంగా లీసా ఇండియా మేగజైన్ ప్రతిపాదించిన ఎకరా నమూనా వారికి ఎక్కువ ఆసక్తి కలిగించింది. చాలా మంది దానిని అనుసరిస్తున్నారు. వారిలో చాలా మంది క్షేత్రాలను స్వయంగా సందర్శించి కొత్త విధానాలను, పద్ధతులను తమ పంట పొలాల్లో అనుసరించేందుకు ఆసక్తి చూపించారు.

ఇతర ప్రచార సాధనాలు కూడా లీసామేగజైన్ లోని సమాచారాన్ని తమ ప్రింట్, దృశ్య ప్రచారాల్లో విస్తృతంగా ఉపయోగించు కుంటున్నారు. ఈ సమాచారం ఆధారంగా చాలా మంది పాత్రికేయులు తమ స్థానిక భాషలలో ఇతరులకు చేరవేస్తున్నారు. ఉదాహరణకు లీసా ఇండియా మేగజైన్ ప్రచురించిన వ్యాసం సహాయంతోనే కన్నడ దినపత్రిక ప్రజావాణి విలేకరి



నందీశ్ పొలంలో భూమిలో తేమను కాపాడేందుకు వీలుగా పెంచి పోషిస్తున్న హరితహారం

ఎకరా నమూనాపై తన పత్రికలో ఒక వ్యాసం ప్రచురించాడు. దానిని చూసిన పాఠకుల నుంచి సుమారు 5 వేల మంది మరింత సమాచారం కోరుతూ ఆయనకు ఫోన్లు చేశారు. బెంగాలీ, ఒరియా, మలయాళం భాషల్లోకి చాలా మంది పాఠకులు వీటిని అనువదించి తమ ప్రాంతీయులకు అందుబాటులోకి తెచ్చారు. ఆల్ ఇండియా రేడియో తన వ్యవసాయ కార్యక్రమాలలో ఇలా మేగజైన్ లోని సమాచారాన్ని ఉపయోగించుకుంది. లీసా ఇండియా మేగజైన్‌కు వ్యాసాలు రాసే కాలమిస్టు శ్రీ నారాయణ రెడ్డితో ఇంటర్వ్యూను గుల్బర్గా రేడియో ప్రసారం చేసింది. దానికి మంచి స్పందన వచ్చింది. ప్రసార భారతి, దూరదర్శన్ డైరెక్టర్ దీని గురించి మాట్లాడుతూ 'లీసా ఇండియా సమాచారమే' పర్యావరణ అనుకూల సేద్యం విషయంలో తమకు ప్రామాణికంగా నిలిచిందని చెప్పారు. అంతేకాక తమ సిబ్బందిని ఈ మేగజైన్ సమాచారాన్ని అధ్యయనం చేసి కార్యక్రమాలను రూపొందించాలని ఆయన సూచించారు కూడా.

మార్పులకు తోడ్పడే సమాచారం కార్పొరేట్ సంస్థలు, బహుళ దేశాల గుత్త సంస్థల అధీనంలో మొత్తం వ్యవస్థ సాగుతున్న సమయంలో ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా మార్పుల కోసం ప్రయత్నించడం కత్తి మీద సాములాంటిదే. చాలా కాలం పోరాడితే కానీ ఫలించే అవకాశం ఉండదు. అలాంటి మార్పు కోసం చేసే ప్రయత్నంలో ఈ సమాచార మార్పిడి అనేదే ప్రధాన సాధనం. అందువల్ల సమాచార మార్పిడి, విజ్ఞాన విస్తరణ అందుకు అవసరమైన ప్రయత్నాలు, అనుసంబంధిత వ్యవస్థలు, సామర్థ్యం పెంపు నైపుణ్యాలు, పాలకుల నుంచి సానుకూల విధాన నిర్ణయాలు చాలా కీలక పాత్ర వహిస్తాయి. అన్నీ సమకూరినప్పుడే వ్యవసాయం, జీవనోపాధులు సుస్థిరమైన ఆశించిన ప్రయోజనాలు చేకూరుస్తాయి. ◆

**T M Radha**
Managing Editor, LEISA India
AME Foundation
Bangalore - 560085
Email : leisaindia@yahoo.co.in

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 3, సెప్టెంబరు 2016.

# సేంద్రీయ సేద్యం ప్రోత్సాహక సంస్థలు

**ఎస్. వల్లల్ కన్నన్, పి. ఆనంద ప్రియ, పి. తమిళ్ సెల్వి**

**సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వడం కోసం ప్రధాన స్రవంతిలోని సంస్థలు కొన్ని పరస్పర సహకారం ప్రాతిపదికగా కృషిచేస్తున్నాయి. కరూర్ జిల్లాలోని కృషి విజ్ఞాన్ కేంద్రం సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులను మళ్లించడానికి తన అనుబంధ సంస్థల సహకారంతో ప్రయత్నిస్తోంది. అదే సమయంలో వారి ఆదాయాన్ని, వ్యవసాయ ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రయత్నిస్తూనే వారిలో ఆత్మవిశ్వాసాన్ని, స్వయంసమృద్ధిని కూడా పెంపొందించేందుకు కృషి చేసింది.**

దేశంలో సేంద్రీయ వ్యవసాయానికి, ఆ రకంగా ఉత్పత్తి చేసిన వస్తువుల మార్కెటింగ్‌కు విస్తృతంగా అవకాశాలు ఉన్నప్పటికీ, వాటి నాణ్యతను నిర్ణయించి ఎగుమతి చేసేందుకు మాత్రం సరైన అవకాశాలు లేవు. అందుకు చాలా కారణాలున్నాయి. నిర్దేశించిన నాణ్యతల మేరకు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన విద్యా, విజ్ఞానం రైతులకు లేకపోవడం ఒక కారణం. సేంద్రీయ వ్యవసాయం విషయంలో గానీ, అందుకు అవసరమైన సదుపాయాల గురించి కానీ, మార్కెట్ పరిస్థితుల గురించి కానీ రైతులకు అవసరమైన సమాచార పంపిణీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం మరో కారణం. సేంద్రీయ సాగు విషయంలో వినియోగదారుల ప్రాధాన్యతను తెలియజేసే సమాచారం వారికి అందించే వారు లేరు. ఇక అలాంటి సమాచారాన్ని వారికి అందజేయాలంటే అయ్యే ఖర్చుల భారం చాలా ఎక్కువ. ఉన్న సమాచారాన్ని సరైన పద్ధతిలో భద్రపరచే ఏర్పాట్లు లేవు. పరిశోధనల ఫలితాలు వారికి చేరే మార్గం కానీ, వారికి సరైన సలహాసూచనలు ఇచ్చేవారు కానీ లేరు. ఇక చివరిగా పరిశోధనలకు సరైన ప్రోత్సాహం అందడం లేదు.

గ్రామీణుల భాగస్వామ్య పరస్పర అభిప్రాయ సేకరణ (పార్టిసిపేటరీ రూరల్ అప్రయిజల్ - పీఆర్ఏ) విధానం కింద, ఇంకా ఇతర చర్చలు, సంప్రదింపుల ద్వారా కరూర్ జిల్లాలోని కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే) సేంద్రీయ వ్యవసాయం అనుసరిస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసింది. కొన్ని సమస్యలను గుర్తించింది. ఉత్పాదన తక్కువగా ఉండడం, సేద్యపు పనుల్లో పేరుకుపోయే వ్యర్థాలను సరైన రీతిలో పునర్వినియోగం చేయకపోవడం, గిట్టుబాటు కాని ధరవరలు,



*సేంద్రీయ ఉత్పాదనలు, విధానాల ప్రదర్శన.........*

సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడం, సరైన సమాచారం కానీ, మెరుగైన పరిజ్ఞానం కానీ సకాలంలో అందే సదుపాయాలు లేకపోవడం వంటివి వారు గుర్తించిన సమస్యల్లో ముఖ్యమైనవి. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, అధికోత్పత్తిని సాధించేందుకు, సన్న, మూకుమ్మడిగా రైతుల ఉత్పత్తులకు అవసరమైన ధ్రువీకరణలు సమకూర్చుకోవడంలో చిన్న కారు రైతులకు కూడా సముచితమైన అవకాశాలు కల్పించడం కోసం కరూర్ కేవీకే ఆ ప్రాంతంలోని వ్యవసాయదారులతో కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చింది.

అందుకోసం కొన్ని గ్రామాలను ఒక క్లస్టర్‌గా విభజించారు. అందుకు భౌతిక సామీప్యత, వ్యవసాయ విధానాల్లో ఏకరూపకతలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆ రకంగా 63 గ్రూపులను 4 క్లస్టర్లుగా ఏర్పాటుచేసారు. ఈ పరిసరాలలో వరి, చెరకు, అరటి, వేరుశెనగ, మొక్కజొన్న ఇంకా కాయగూరలు, అరటి, పెండలం (టపోయికా) వంటి కొన్ని రకాలైన తోటల పెంపకం అధికంగా సాగుతూ ఉంటుంది.

## సంస్థాగత కృషి

జిల్లాలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కరూర్ కేవీకే సంస్థాగతంగా తన వంతు కృషి తాను చేస్తోంది. రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల నుంచి కేవీకే ఉత్పత్తికి సంబంధించిన సమాచారం సమకూర్చుకుంటోంది. ఆర్థిక సహాయం కోసం జాతీయ స్థాయిలోని ఆర్గానిక్ ఫార్మింగ్ సెంటర్ సహాయం తీసుకుంటోంది. నాణ్యతా ప్రమాణాలను కాపాడే విషయంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహక అథారిటీ (అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ - ఏపీఈడీఏ) సహకారాన్ని,

మార్కెట్‌కు సంబంధించి, వస్తువుల సేకరణకు సంబంధించి సమాచారం కోసం మాత్రమే కాక ఆ సమాచారాన్ని రైతన్నలకు చేరవేయడంలో మార్కెటింగ్ సంస్థల సహాయాన్ని, క్లస్టర్ స్థాయిలో స్థానిక వ్యవస్థల నుంచి ఉపయోగకరమైన సమాచారం రైతన్నలకు చేరవేయడం కోసం సమన్వయపరుస్తోంది. ఇప్పటి వరకు మనం చెప్పుకున్న వివిధ రకాలైన సంస్థలు ఒక్కో రంగంలో విశేషమైన నైపుణ్యాన్ని, ప్రత్యేకతను సంపాదించుకున్నవే కావడం గమనార్హం.

## సామర్థ్యం పెంపు యత్నాలు

వ్యవసాయదారుల నైపుణ్యాలను పెంపొందించి, వారికి అవసరమైన పరిజ్ఞానాన్ని తెలియజేయడం కోసం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతోపాటు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ విధానాలపై ముఖ్యంగా భూసార పరిరక్షణ, అందుకు అనుసరించవలసిన విధానాలు, పాటించవలసిన సూత్రాలు, సహజ వనరుల సద్వినియోగం, సేంద్రీయ సేద్యం గురించిన సమాచారాన్ని భద్రపరచడం, ఉత్పాదనలకు అవసరమైన సర్టిఫికెట్లు సమకూర్చుకోవడం వంటి వాటిని రైతులకు వివరించేందుకు కృషి సాగుతోంది. క్షేత్ర స్థాయిలో మాత్రమే కాకుండా కేవీకే లలో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. 2006-08 సంవత్సరంలో దాదాపు 3402 మంది అన్నదాతలకు కేవీకే శిక్షణ ఇచ్చింది.

జీవసంబంధ (బయో) ముడి సరుకులు, బయోగ్యాస్ వ్యర్థాలను ఉపయోగించడంపై శిక్షణ ఇచ్చారు. బయోముడి సరుకుల వినియోగంపై శిక్షణ కోసం ఘజియాబాద్‌లోని జాతీయ సేంద్రీయ వ్యవసాయ కేంద్రం ఆర్థిక సాయం అందించింది. వరి సాగు, బెండకాయ మొక్కల పెంపకం, అరటి తోటల పెంపు విషయంలో వడసేరి, అర్చంపట్టి, ముతులైపట్టి గ్రామాలలో ప్రదర్శనలు ఏర్పాటుచేయటం జరిగింది. ఫలితంగా అక్కడి రైతులలో సేంద్రీయ సేద్యంపై ఆత్మవిశ్వాసం పెంపొందించింది. శిక్షణ పొందిన వారే కాక ఇతర రైతన్నలు కూడా సేంద్రీయ వ్యవసాయం ఆసక్తిని పెంచుకున్నారు. ప్రయోగాత్మకంగా కొద్దిపాటి జాగాలో సేంద్రీయ సేద్యం చేపట్టారు. ఈ క్రమంలో వారు బయో ఫెర్టిలైజర్లు, బయో పెస్టిసైడ్స్‌ను (ఆజోస్పిరిలం, ఫాస్ఫో బ్యాక్టీరియా, సూడోమోనాస్, ట్రికోడెర్మా), బయో కంట్రోల్ ఏజెంట్లు (ట్రికోగ్రామా జపోనికమ్, ట్రిపోగ్రామా కిలోనిస్), గ్రీన్ మాన్యువర్స్ (ఎండకు ఎండిపోయిన ఆకులు అలములు... సన్‌హెంప్, ధైంచా, కాల్‌ట్రోపిస్, అవరాయ్, కోలింజీ వంటివి), జంతు సంబంధమైన పెరుగుదలకు తోడ్పడే పదార్థాలు (పంచగవ్య, అమృత్ పానీ, వెర్మికంపోస్ట్, వెర్మివాష్, ఫిష్ అమినో ఆసిడ్స్, పండ్ల వ్యర్థాలు) ట్రాప్స్, బొటానికల్స్ ఇంకా అనేక రకాలైన మెరుగుపరచిన ఎరువులు ఉపయోగించారు.

బయోగ్యాస్ తయారీలో మిగిలిపోయే వ్యర్థాల నుండి మెరుగైన ఎరువులను తయారు చేసే విధానాన్ని - అయిదు వేర్వేరు ప్రాంతాలలో - నువ్వులు, సన్ ఫ్లవర్, వేరుశనగ సాగులో ఉపయోగించడం గురించి వారికి ప్రదర్శించి చూపించడం జరిగింది. బయోగ్యాస్ వ్యర్థాలకు నైట్రోజిన్ చేర్చుతోను, ద్రవరూపంలోకి మార్చడానికి వీలైన బ్యాక్టీరియా, ఫంగీ వంటి వాటిని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం జరిగింది. ఇతర రకాలైన ఆర్గానిక్ ఇన్‌పుట్స్ గురించి తెలియజేయడం జరిగింది. కులితలై మరియు కడవూరు బ్లాకులలోని పులుహెరి, సీతాపట్టి, వడసెరి, తరగంపట్టి, ఆర్.టీ. మలై ప్రాంతాల రైతులు ఈ ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొన్నారు.

## పెరిగిన అవగాహన

ప్రదర్శనలు, మీడియా కార్యక్రమాలు, ప్రత్యక్ష పరిశీలన వంటివి చేపట్టి రైతు సోదరుల్లో విస్తృతమైన అవగాహన కలిగించే ప్రయత్నం జరిగింది. కనీసం 760 మంది రైతన్నలు ఇలాంటి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇందుకోసం 2006 నుంచి 2008 మధ్య కాలంలో 14 పర్యటనలను నిర్వహించారు. ఇదే సమయంలో 21 ప్రదర్శనలను నిర్వహించారు. దాదాపు 2000 మంది స్త్రీ, పురుషులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువరైతులు, విస్తరణాధికారులు ప్రదర్శనల వల్ల ప్రయోజనం పొందారు. ఈ విధంగా రైతుల్లో సేంద్రీయ వ్యవసాయంపై కరూర్ జిల్లాలో పాటు పొరుగు జిల్లాల్లోని రైతు మిత్రులలో పూర్తి అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సమగ్రమైన కార్యక్రమాల ఫలితంగా సేంద్రీయ సేద్యం చేపట్టిన రైతులకు, వినియోగదారులకు మధ్య పరస్పర ప్రయోజనకరమైన సాన్నిహిత్యం నెలకొన్నది.

ఇక మాస్ మీడియాలోని అంతర్భాగాలైన రేడియో, టీవీ, న్యూస్‌పేపర్స్ వంటి వాటిని సాధనంగా చేసుకుని మరింత మందికి చేరువయ్యే ప్రయత్నం జరిగింది. పుస్తకాలు, మేగజైన్లు ఇలా అనేక రూపాలలో సమాచార పంపిణీ కసరత్తు జరిగింది. మూడు నెలలకోసారి వెలువడే న్యూస్ లెటర్స్ ఆర్గానిక్ రినైసాన్స్ పేరుతో ఎప్పటికప్పుడు తాజా సమాచారం రైతన్నలకు అందించారు.

నమూనాగా కొంతమంది రైతన్నల అభిప్రాయాల సేకరణ రూపంలో నిర్వహించిన సర్వేలో తేలిన కొన్ని ముఖ్యమైన అంశాలు... 2008 నాటికి శిక్షణ లేదా పరిచయం ఉన్న రైతన్నలలో దాదాపు 83 శాతం మందికి అన్ని విషయాలలో పూర్తి అవగాహన కలిగింది. ముఖ్యంగా సేంద్రీయ సేద్యానికి సంబంధించిన సూత్రాలు, భూసారం పరిరక్షించడమే కాకుండా దానిని మెరుగుపరిచే విధానాలు, ఇందుకు అవసరమైన భూమిని ఎం

పిక చేసుకునే విధానాలు, చీడపీడల నివారణ పద్ధతులు, పంట పండించిన తర్వాత అనుసరించవలసిన విధానాలు, అనుభవాలను భద్రపరచడం, అవసరమైన సర్టిఫికెట్లను సంపాదించుకునే మార్గాలను గురించిన మెళకువలు సమగ్రంగా తెలియవచ్చాయి. 2005 నాటి అంకెలతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. 2005లో ఈ అంశాలపై అవగాహన ఉన్నవారు 42 శాతం మాత్రమే. ఈ ఫలితాల సాధనకు ముఖ్య కారణం కేవీకే నిర్వహించిన ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర విస్తరణ ప్రయత్నాలే ప్రధాన కారణం.

## సేంద్రీయ సేద్యంలో రైతులే నిపుణులు కూడా....

సేంద్రీయ వ్యవసాయం గురించిన అవగాహన సమకూర్చుకున్న వాళ్లలో దాదాపు 85 శాతం మంది శాస్త్రీయ పద్ధతులనే అనుసరిస్తున్నారు. పొలం ఎంపిక దగ్గర నుంచి ఫలసాయాన్ని మార్కెట్‌లో విక్రయించుకునే వరకు అన్ని విధాలా ఆర్గానిక్ సూత్రాలనే పాటిస్తున్నారు. 2006లో 27, 2007లో 47, 2008లో 22, మొత్తం మీద సేంద్రీయ వ్యవసాయం చేపట్టేం దుకు ముందుకు వచ్చిన 96 రైతుల గ్రూపులు ఏర్పాటయ్యాయి. ఈ 96 గ్రూపుల్లో చేరిన రైతుల సంఖ్య 1930కి చేరింది. ప్రతి గ్రూపులోనూ ఒకరు నాయకుడిగా వ్యవహరిస్తారు. సాధారణంగా అలాంటి వారిని ఏకగ్రీవంగానే ఎంపికచేసుకుంటారు. వారికి ముందుగా సేంద్రీయ వ్యవసాయం, అనుభవాల డాక్యుమెం టేషన్, సర్టిఫికేషన్ కోసం, మార్కెటింగ్ కోసం అనుసరిం చవలసిన విధివిధానాలపై పూర్తి శిక్షణ ఇస్తారు. ఆ రకంగా పూర్తిగా తర్ఫీదు పొందిన రైతు గ్రూపుల నాయకులు ఇతరులకు మార్గదర్శకులుగా, సాంకేతికపరమైన సలహాదారులుగా వ్యవహరిస్తారు. 2006లో ఇలా నలుగురు తర్ఫీదు పొందారు. ఆ సంఖ్య 2007 నాటికి 17కు, 2008 నాటికి 53కు పెరిగింది. అటు నైపుణ్యం పెరగడంతో పాటు సాంకేతికంగా సలహాసూచనలిచ్చే వారి సంఖ్య పెరగడంతో విస్తరణ వేగవంతంగా సాగింది. వారికి స్థానికంగా మంచి ఆదరణ ఉంటోంది.

ఇలా గ్రూపులో రిజిస్టరయిన రైతులకు కొంత ప్రదేశాన్ని కేటాయించి, ఆర్గానిక్ సేద్యాన్ని ఇతర రైతులకు పరిచయం చేసే బాధ్యతను అప్పగించడం జరిగింది. ఇలా తమకు కేటాయించిన కొద్ది ప్రాంతాలలో కేవీకే సాయంతో విస్తరించేందుకు కృషి జరిగింది. 2006లో 116.82 హెక్టార్లలో 532 మంది రైతన్నలు సేంద్రీయ సేద్యం ప్రారంభించారు. వాళ్లు వరి, అరటి, నువ్వులు, సన్‌ఫ్లవర్, వేరుశెనగ, పెసలు, మినుములు వగైరా సాగు చేసారు. 2007 నాటికి ఈ రకంగా సేంద్రీయ సేద్యం 269.63 హెక్టార్లకు విస్తరించింది.

> వినియోగదారుల్లో అవగాహన కోసం వివిధ ప్రాంతాలలో సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. దానితో పాటు వాటి మార్కెటింగ్ కోసం మార్కెటింగ్ నిర్వాహకులతో పటిష్టమైన వ్యవస్థ రూపుదిద్దుకుంది

## స్వయంసమృద్ధి బాటలో...

ఇందుకు అవసరమైన సేంద్రీయ ముడి సరకులను చాలా మటుకు స్థానికంగానే తయారుచేసుకునేవారు. ఆ విధం గా బయట నుంచి వాటిని తెప్పించుకోవల్సిన అవసరం చాలా వరకు తగ్గిపోయింది. వాళ్లు ఎక్కువగా వెర్మి పోస్టు ఎరువులను ఉపయోగిస్తారు. వారికి ఎంపిక చేసిన ప్రదేశంలో 44 మంది రైతులు వర్మీ పోస్టు తయారీకి ముందుకు వచ్చారు. అలా తయారు చేసిన వర్మీ పోస్టును ప్రారంభంలో తమ పొలాల్లోనే ఉపయోగించుకున్నారు. మిగులు ఉంటే పొరుగు రైతులకు విక్రయించేవారు. మరి కొందరు రైతులు ఇంట్లోనే తయారుచేసుకునే పెరటి ఎరువులను ఉపయోగించారు. వాటిని పొలంలో లభించే ఎరువులతో అంటే బయో ఫెర్టిలైజర్లతో మెరు గుపరచుకున్నారు. వర్మీ పోస్ట్ తయారీకి ఏర్పాటుచేసిన కేంద్రాల ద్వారా ఏటా 399 టన్నుల మేరకు ఉత్పత్తి అయ్యేది.

చాలా మంది వ్యవసాయదారులు పంచగవ్య, ఇతర క్రిమి నివారకాలను అవసరాన్ని బట్టి ఉపయోగించేవారు. సేం ద్రీయ ఎరువుల తయారీ కోసం 2006లో 18 యూనిట్లను ఏర్పాటుచేయగా వాటి సంఖ్య 2008 నాటికి 56కు పెరిగింది.

సేంద్రీయ ఎరువులను ఉపయోగించిన కారణంగా సాగు వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. సేంద్రీయ ఎరువుల తయారీ కారణంగా ఫలసాయానికి అదనపు ధర రావడం వల్ల రైతుకు అదనపు ఆదాయం చేకూరింది. ఈ విధంగా చూస్తే హెక్టారుకు 2006లో రూ.1130 రాగా, 2007లో రూ.1250, 2008లో రూ.1820 ధర పలికింది. ఆర్గానిక్ ఎరువుల తయారీ యూనిట్ల ఏర్పాటు వల్ల అదనంగా పనిదినాల ఉపాధి కూడా లభించింది. ఈ రకంగా 2006లో 142, 2007లో 198, 2008లో 210 పనిదినాల అదనపు ఉపాధి లభించింది.

## ఉత్పత్తిదారులు-వినియోగదారుల అనుసంధానం

కరూరు జిల్లాలో సేంద్రీయ సేద్యం చేసే విస్తరణ పెరిగే కొద్దీ సేంద్రీయ ఉత్పత్తుల లభ్యత కూడా పెరుగుతూ వచ్చింది. ఇక వినియోగదారుల్లో అవగాహన పెంపొందించేందుకు వివిధ ప్రదేశాల్లో ప్రత్యేక ప్రదర్శనలను నిర్వహించారు. అలాంటి సేంద్రీయ ఉత్పాదనల మార్కెటింగ్ కోసం కేవీకే మార్కెట్ ప్రమోటర్లతో లింకేజీ ఏర్పాటుచేసింది. రాష్ట్ర స్థాయిలోనూ,



*సేంద్రీయ ఉత్పత్తుల శుద్ధి కేంద్రం..........*

జాతీయ స్థాయిలోనూ జరిగిన ప్రదర్శనల్లో కేవీకే కూడా పాల్గొని వాటికి ఒక గుర్తింపును సంపాదించిపెట్టింది. కేవీకే ఆధ్వర్యంలోని సేంద్రీయ నువ్వులు, బియ్యం శుద్ధి కేంద్రాలు కూడా ఏర్పాటయ్యాయి. సర్టిఫైడ్ ప్రాసెసింగ్ యూనిట్ల సాయంతో జిల్లాలో నాణ్యమైన సరుకు అందుబాటులోకి వచ్చింది.

## ముగింపు మాట

సమాచార మార్పిడి, రిసోర్స్ సెంటర్లుగా ఈ కేవీకేలు ఏర్పడి జిల్లాలో వ్యవసాయ ఆర్థిక రంగాన్ని మరింత పటిష్టవంతం చేసింది. ఈ కృషిలో భాగంగా జాతీయ స్థాయి పరిశోధనలను రైతుల చేను వరకు విస్తరించేందుకు సహకరించింది. కేవీకే కృషి కారణంగానే కరూర్ జిల్లాలోని వ్యవసాయదారులు సేంద్రీయ సేద్యం వైపు ఆకర్షితులయ్యారు. పర్యావరణకు అన్ని విధాలా అనుకూలమైన సేంద్రీయ సేద్యాన్ని చేపట్టారు. అందుకు ఈ కేంద్రాలు అనుసరించిన బహుముఖ ప్రయత్నాలే కారణం. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, జాతీయ ఆర్గానిక్ ఫార్మింగ్ సెంటర్, వ్యవసాయ, శుద్ధి చేసిన ఉత్పాదనల ఎగుమతి అభివృద్ధి కౌన్సిల్ వంటి సంస్థల సహాయసహకారాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫలితంగా ఇప్పుడు జిల్లా రైతాంగానికి అదనపు ఆదాయం వస్తోంది. మార్కెట్ సరుకులపై ఆధారపడవలసిన అగత్యం తప్పిపోయింది. ◆

**S. Vallai Kannan**
KVK, Karur
Pulituri Village, R.T. Malai Post,
Kulitalai Taluk, Karur District, Tamilnadu
E-mail : vallalkannan@yahoo.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 16, సంచిక 4, డిసెంబరు 2016.

## మీ ప్రకటనలకు సరైన చోటు




వ్యవసాయరంగ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తోంది **లీసా ఇండియా మేగజైన్. ఇప్పటికే మా పత్రిక 20000 పాఠకులకు అందుతోంది.** వ్యవసాయమే జీవన విధానంగా, సేద్యమే తమ ప్రవృత్తిగా చేపట్టి వ్యవసాయాభివృద్ధి పైనే ఆసక్తితో ఉండే మా పాఠకులు నిరంతరం పర్యావరణ శ్రేయస్సునే కోరుకుంటారు. వారి అవసరాలు, ఆలోచనలకు అనుగుణమైన సమాచారాన్ని ప్రింట్ రూపంలోనూ, డిజిటల్ రూపంలోనూ అందించడమే మా మేగజైన్ ఆశయం. అందుకే వ్యవసాయదారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు, రీసెర్చర్లు, విద్యార్థులు, ప్రభుత్వ విభాగాలు, వాణిజ్య బ్యాంకులు మూడు నెలలకు ఒకసారి వెలువడే ఈ మేగజైన్ కోసం ఎదురు చూస్తూ ఉంటారు.

రెండు దశాబ్దాలుగా లీసా ఇండియా మేగజైన్ అత్యుత్తమ శ్రేణికి చెందిన సమాచారాన్ని, ఆచరణయోగ్యమైన సేద్య విధానాలను ఆకర్షణీయమైన పేజీలలో, రంగురంగుల అలంకారాలతో, సకాలంలో అందించడంలో నిబద్ధతను పాటిస్తున్నది. ప్రస్తుతం ఈ మేగజైన్ 8 భాషల్లో ప్రచురితమవుతోంది. అవి - **ఇంగ్లీషు, హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, ఒడియా, పంజాబీ, మరాఠీ.**

వ్యవసాయ రంగానికి ప్రాణప్రదమైన పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేందుకు - ఆసక్తి కల ఔత్సాహిక విద్యా సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు నుంచి వారి ఉత్పాదనలను, సేవలను, విద్యాపరమైన కోర్సులను, పెద్ద సంఖ్యలో పాఠకుల దృష్టికి చేర్చాలని ఆశించే సంఘటనల గురించిన వివరాలను వాణిజ్య ప్రకటనల రూపంలో అందించేందుకు సాదరంగా ఆహ్వానిస్తున్నాం. వివరాలకు leisaindia@yahoo.co.in (శ్రీమతి రుక్మిణి) సంప్రదించగలరు.

# బేరసారాల్లో రైతన్నకు మద్దతు

## దేవరాజన్ పూజాహరి - ఆర్తీ దయాల్

**లాభాపేక్షలేని టెక్నోసెర్వ్ వంటి సంస్థలు భాగస్వామ్య పద్ధతిలో చిన్న, సన్నకారు రైతన్నలకు బేరసారాల్లో తన వంతు మద్దతు అందిస్తున్నాయి. వారికి ఉపయోగపడే సమాచారం (ఇన్ఫర్మేషన్) అంటే మార్కెట్‌లో లభిస్తున్న అవకాశాల గురించిన సమాచారం అందించడానికి ఇలాంటి సంస్థలు కృషిచేస్తున్నాయి. టెక్నోసెర్వ్ ప్రోత్సాహంతో బీహార్‌లోని చిన్న చిన్న రైతన్నలు వ్యవసాయ ఉత్పత్తిదారుల గ్రూపులుగా ఏర్పడి, సమష్టి మార్కెటింగ్ నైపుణ్యాలు సమకూర్చుకుని బేరసారాలు స్వయంగా నిర్వహించుకోగలుగుతున్నారు.**

బీహార్‌లోని మొక్క జొన్న విస్తృతంగా సాగు చేసే ప్రాంతాలలో పూర్ణియా జిల్లా ఒకటి. ఇక్కడ రబీ పంట కాలంలో అత్యధిక దిగుబడి వస్తుందని సర్వత్రా గుర్తింపు పొందింది. ఎకరాకు నాలుగు టన్నులు ఉత్పత్తి రావడం ఇక్కడ సర్వసాధారణం. ఈ జిల్లాలో మొక్క జొన్న సాగు వాణిజ్య పంటలలో చాలా ముఖ్యమైనది. మొక్క జొన్న సాగు చేసే రైతన్నలలో చాలా మంది చిన్న, సన్నకారు రైతన్నలే. వారిలో చాలా మందికి గట్టిగా 1.39 ఎకరాల భూమి మాత్రమే ఉంటుంది. అయినా మార్కెట్‌లో విక్రయించేందుకు ఇక్కడ సాగయ్యే మొక్క జొన్నలో దాదాపు 90 శాతం మిగులు ఉంటుంది. కానీ వారికి స్థానిక మార్కెట్‌లోకి అడుగు పెట్టేందుకు అవకాశాలు అంతంత మాత్రమే. అందువల్ల వాళ్లు తమ పంట దిగుబడిని విక్రయించుకునేందుకు దళారుల వ్యవస్థ మీదే ఆధారపడవలసి ఉంటుంది.

ఈ దళారుల వ్యవస్థ చాలా విస్తృతమైనది. సంక్లిష్టమైనది. గ్రామ స్థాయిలో సేకరించే ఏజెంట్ల దగ్గర నుంచి మార్కెట్‌లోని పెద్ద వ్యాపారులకు, వారి ద్వారా ఇంకా పెద్ద స్థాయి బ్రోకర్లు ఇందులో వివిధ స్థాయిలో సేకరణ, క్రయవిక్రయాలు చేస్తూ ఉంటారు. వీరు చిట్టచివర దేశ వ్యాప్తంగా వ్యాపార సంబంధాలు ఉన్న పెద్ద పెద్ద సంస్థలకు విక్రయిస్తుంటారు. ప్రతి స్థాయిలోని దళారి కూడా కొంత కమిషన్ తీసుకుంటాడు. అందువల్ల రైతు దగ్గరికి వచ్చేసరికి చాలా కొద్ది మొత్తం వారికి లభిస్తూ ఉంటుంది. ఇది చాలక దళారులు గ్రామాలకు కొనుగోలుకు వచ్చిన సమయం లో సరుకు నాణ్యతను లెక్కకట్టడానికి అనుసరించే పద్ధతుల్లో మానవ తప్పిదాల కారణంగా రైతన్నకు ప్రతి క్వింటాలుకు కనీసం రూ.60 నుంచి రూ.80 వరకు నష్టం వస్తుంటుంది. రైతన్నల దురదృష్టం కొద్దీ వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీ చట్టం రద్దు అయింది. ఫలితంగా రైతుల పరిస్థితి మరింత అధ్వాన్నం అయింది. మార్కెట్ వ్యవస్థ స్వరూపం మారిపోయింది. వాణిజ్య నిబంధనలు మాయమయిపోయాయి. అందువల్ల ఇప్పుడు పంట దిగుబడికి ధరలను పెద్ద వాణిజ్యవేత్తలే ఖరారు చేస్తున్నారు. పంట దిగుబడి నాణ్యతను కళ్లతో చూసి, చేతితో పట్టుకుని వారికి ఇష్టం వచ్చినట్టు తేల్చేస్తున్నారు. తేమను కొలిచే సాధనాలను ఉపయోగించడం లేదు. ఇలా అస్తవ్యస్తం గా మారిపోయిన మార్కెట్ వ్యవస్థలో తప్పుడు కొలమానాలు. తప్పుడు తూనికలు ఉపయోగించి రైతులను నిలువునా ముంచి వేసే విధంగా ధరలను గిట్టుబాటు కాని స్థాయికి దిగజార్చేస్తున్నారు.

### వ్యవసాయోత్పత్తుల కంపెనీ రూపంలో మహిళల సమష్టి కృషి

బీహార్‌లోని సన్నకారు, చిన్న రైతన్నలకు ఎదురవుతున్న పై సమస్యల పరిష్కారానికి గాను ప్రపంచ బ్యాంకు సహకారంతో జీవిక అనే పేరుతో ఒక కార్యక్రమం ప్రారంభమయింది. ఇది ప్రధానంగా పేదరికం నిర్మూలన లక్ష్యంతో ఆర్యన్యక్ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఏఏపీసీఎల్)ను ఏర్పాటు చేసింది. బీహార్‌లో గ్రామీణ జీవనోపాధుల ప్రోత్సాహక సొసైటీ ఆధ్వర్యంలో జీవిక స్వతంత్రంగా పనిచేస్తున్న సంస్థ. ఈ మొత్తం కార్యక్రమం జాతీయ జీవనోపాధుల మిషన్‌కు అనుబంధంగా రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న గ్రామీణ జీవనోపాధుల మిషన్ పేర నిర్వహించబడుతోంది.

కంపెనీల చట్టం కింద ఆర్యన్యక్ కంపెనీని 2009 నవంబర్‌లో ఏర్పాటు చేశారు. దీని ప్రధాన కార్యాలయం పూరిఅనయా జిల్లాలోనే ఉంది. కంపెనీ మూలధనం రూ.5 లక్షలు కాగా, ఒకొక్కటి రూ.10 విలువతో 50వేల షేర్లను జారీ చేయవచ్చు. జీవిక కింద గుర్తించిన చిన్న, సన్నకారు రైతులు ఇందులో వాటాదార్లుగా ఉంటారు. వాటాదార్లందరూ దందహా బ్లాకు పరిధికి చెందిన వారే. ఈ కంపెనీ 2009 లోనే ఏర్పాటు అయినప్పటికీ, దీని కింది ప్రారంభమైన ఉత్పత్తిదారుల గ్రూపులు నిరుపయోగంగా ఉండిపోవడంతో రైతన్నలకు చాలా కాలం ఎలాంటి ప్రయోజనం కలగలేదు. బీహార్‌లోని చాలా మంది మహిళా సాగుదారులు చిన్న, సన్నకారు స్థాయిలోని వారే. వారు స్వయంగా తమ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించుకునే సామర్థ్యం లేని వారే. మంచి ధర వచ్చే వరకు సరుకును నిల్వ చేసుకునే శక్తి లేనివారే. సరుకు కొనడానికి వచ్చే పెద్ద వ్యాపారులతో బేరసారాలు ఆడగలిగే నేర్పు కానీ, నైపుణ్యం కానీ, సమాచార పరిజ్ఞానం కానీ లేకపోవడంతో ఆర్థికంగా గిట్టుబాటు ధరలు పొందలేకపోయేవారు. నష్టాల పాలయ్యేవారు. అందువల్ల

సమష్టిగా నిల్వను సమీకరించుకుని మార్కెట్‌లో సరైన ధర పొందలేక ఇబ్బందులు పడుతుండేవారు.

## భాగస్వామ్య పద్ధతి

ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు టెక్నోసెర్వ్ ఇండియా సహకారంతో జీవిక 214లో ఒక కార్యక్రమానికి నాంది పలికింది. టెక్నోసెర్వ్ సంస్థ పని తీరే విభిన్నమైనది. లాభాపేక్ష లేకుండా పేద ప్రజలకు మార్కెట్ అవకాశాలను, సమాచారాన్ని అందజేయడానికి కృషి చేయడమే దీని ఆశయం. ఈ ప్రాజెక్టుకు బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ నుంచి ఆర్థిక సహాయం లభిస్తుంది. విలువల పెంపుతో పాటు బీహార్‌లోని రెండు జిల్లాలను లక్ష్యంగా చేసుకుని మహిళా రైతులను వ్యవస్థీకృతం చేయడం జీవిక నిర్దేశించుకున్న లక్ష్యం. ఆ రకంగా వ్యవస్థీకృతమైన మహిళా వ్యవసాయ ఉత్పత్తిదారులను మార్కెట్ ప్రభావమే అధికంగా ఉన్న బీహార్‌లో ఒక శక్తివంతమైన వ్యవస్థగా మార్చడం జీవిక నిర్దేశించుకున్న ఆశయం. ఈ లక్ష్యాలను సాధించేందుకు పూర్ణియా జిల్లాలో టెక్నోసెర్వ్ సంస్థ ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపట్టింది. దీని సాయంతో రైతన్నలకు గిట్టుబాటు ధర సమకూర్చడం కోసం వారిని సమన్వయ పరచడం, వారికి మార్కెట్ పరిస్థితుల గురించిన అవగాహన కల్పించడం, మార్కెట్ సమాచారం వారికి చేరవేయడం, జాతీయ స్థాయిలో కొనుగోలుదారులతో వారిని సమన్వయం సాధించిపెట్టడం వంటి బాధ్యతలను టెక్నోసెర్వ్ చేపడుతుంది.

పూర్ణియాలో పంట స్థితిగతులపైనా, ప్రస్తుతం పంటలను పండించడంలో ఎదురవుతున్న సమస్యలపైనా టెక్నోసెర్వ్ నిర్వహించిన ప్రాథమిక నివేదిక ప్రకారం, అందరు రైతుల ఫలసాయాన్ని ఒకచోటికి చేర్చి మార్కెట్ లింకేజీలను ఏర్పాటుచేస్తే, అంచెలంచెలుగా ఉన్న దళారీ వ్యవస్థను నిర్మూలించడం సాధ్యమవుతుందని ఉత్పత్తిదారుల కంపెనీకి సిఫార్సు చేసింది. గిట్టుబాటు ధరలను సాధించడానికి సాధ్యమవుతుందని అభిప్రాయపడింది. ఈ విధంగా చేస్తే రైతులకు వ్యవసాయ కాలంలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ ఆదాయం లభిస్తుంది. నష్ట నివారణకు ముందు జాగ్రత్తగా ఎలక్ట్రానిక్ వ్యాపారంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించింది.

జీవిక సంస్థ సంస్థాగత పటిష్టత కోసం ఉత్పత్తిదారుల కంపెనీ దాదాపు రూ.60 లక్షలను అంతర్గత వనరుల ద్వారా

> ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ ఏర్పాటు వల్ల ఉత్పత్తిదారుల కంపెనీ జాతీయ స్థాయిలో కొనుగోలుదారులతో అనుసంధానం అవుతున్నాయి. అదే సమయంలో చెల్లింపుల్లో జాప్యం నివారించడం సాధ్యమవుతుంది.

సమీకరించింది. ఉత్పత్తిదారుల గ్రూపుల నుంచి (లోటును భర్తీ చేసే విధంగా), క్లస్టర్ ఫెడరేషన్‌ల నుంచి (రుణాల రూపంలో నెలకు 0.6 శాతం వడ్డీపై) ఈ నిధులను సేకరించింది. ఈ నిధులతో మొక్క జొన్న సేకరణ, మార్కెటింగ్ సహాయం అందించేందుకు ఉపయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొక్క జొన్న పండించిన అనంతరం చేపట్టవల్సిన ప్రామాణిక కొలమానం ఉపయోగించడం, గ్రేడింగ్ చేయడంలో ఉత్తమ విధానాలు అనుసరించడం (ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్లు, డిజిటల్ తేమ కొలిచే పరికరాలు) విషయంలో ప్రత్యేకంగా రైతులకు శిక్షణ ఇవ్వటం జరిగింది. ఇలా చేయడం వల్ల సేకరణలోను, అమ్మకంలోను పారదర్శకత చోటు చేసుకునేందుకు ఇవి తోడ్పడతాయి. ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ (NCDEXE Markets Ltd - NeML)

ఉపయోగించడం వల్ల దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద పెద్ద కొనుగోలుదారులను ఆకట్టుకోవడం సాధ్యమైంది. ముందుగా రైతులు తమ ఉత్పత్తులను సర్టిపై చేసిన ఎస్‌ఈఎంఎస్ గోదాములలో నిల్వచేసుకుంటారు. అలా నిల్వ ఉంచుకున్న సరుకును స్పాట్ మార్కెట్ (అప్పటికప్పుడు జరిపే బేరసారాల అనంతరం) లేదా ఫ్యూచర్ మార్కెట్ (భవిష్యత్తులో పెరిగే లేక తరిగే ధరలపై ఒక అంచనాతో) విక్రయించుకునే అవకాశం రైతులకు లభిస్తుంది. ఆ రకంగా రైతులకు సరైన ధర చేకూర్చడానికి వీలవుతుంది. ఈ ప్రక్రియలో ఉత్పత్తిదారుల కంపెనీ మొట్టమొదటి రైతుల కంపెనీగా కంపెనీల చట్టం ప్రకారం రిజిస్టరైంది. ఇది ఎన్‌సీడీఈఎక్స్ వేదిక రూపంలో ఫార్వార్డింగ్ ట్రేడ్ చేయడానికి అనువుగా దీని రూపకల్పన జరిగింది.

ఈ కంపెనీకి చెంది 300 మంది మహిళలు ఆన్‌లైన్‌లో తమ ఉత్పత్తులను విక్రయించుకోగా 2016లో ఆ సంఖ్య 818 మంది



నాణ్యమైన మొక్క జొన్న దిగుబడిలో తేమ శాతం లెక్కకట్టేందుకు ప్రొడ్యూసర్స్ గ్రూపు వాళ్లు ఉపయోగించే డిజిటల్ మీటరు.........

అయ్యారు. గత రెండు పంటల కాలంలో జరిగిన విక్రయాల వివరాలను దిగువన ఉన్న టేబుల్‌లో గమనించవచ్చు.

పైన వివరించిన ప్రయోజనాలతో పాటు ఉత్పత్తిదారుల కంపెనీని పునరుద్ధరించడం వల్ల వ్యవసాయదారులకు పారదర్శక వాణిజ్యం అంటే ఏమిటో, ఆ విధంగా ఆన్‌లైన్‌లో చేసే వాణిజ్యంలో గిట్టుబాటు ధర కోసం ఎలా బేరసారాలు ఆడాలో తెలుసుకోగలిగారు. స్థానిక దళారుల నుంచి సరైన ధర కోసం ఎలా ఒత్తిడి తీసుకురావాలో తెలుసుకున్నారు. దళారులు తమ

## మొక్కజొన్న సేకరణ – ముఖ్య అంశాలు

| 2014–15 సీజన్ | 2015–16 సీజన్ |
|---|---|
| 1014 ఎంటి జొన్న సేకరించారు | 3064 ఎంటి సేకరణ |
| కంపెనీ ఆదాయం రూ.1.28 కోట్లు, లాభం రూ.0.09 కోట్లు | జూలై ఆఖరుకు ఆదాయం రూ.75 లక్షలు |
| రైతులకు వచ్చిన ఇంక్రిమెంటల్ ఆదాయం 11.46 శాతం | సగటున గత ఏడాది కంటే 13.6 శాతం ఎక్కువ |
| లాభాల్లో 70 శాతం బోనస్‌గా చెల్లింపు | 20 గ్రూప్‌ల్లోని 818 మందికి రూ.3.49 కోట్లు పంపిణీ |
| పేట్రొనేజ్ బోనస్ రూపంలో క్వింటాల్‌పై రూ.109 ఆదాయం | గత ఏడాదికన్నా 138 శాతం సభ్యుల భాగస్వామ్యం పెంపు |

## లబ్ధిదారు నోటి మాట

ఇక నుంచి ప్రొడ్యూసర్ కంపెనీ వాళ్లకే పంట ఫలితం విక్రయిస్తాను.

పూర్ణియా జిల్లా తూర్పు ప్రాంతంలోని కుకూన్ గ్రామానికి చెందిన 40 ఏండ్ల షకీలా ఖతూన్ తన అనుభవాన్ని ఇలా వివరించింది. ఉమ్మడి కుటుంబానికి చెందిన మా ఇంట్లో 11 మంది ఉంటారు. మాకు 8 ఎకరాల పొలం ఉంది. మా కుటుంబం యావత్తూ పూర్తిగా వ్యవసాయం మీదే ఆధారపడి జీవితం సాగిస్తోంది. పొలంలోని 95 శాతం భూమిలో మొక్క జొన్న సాగుచేస్తాం. మిగిలిన కొద్ది పొలంలో మా కుటుంబ వినియోగం కోసం గోధుమ పండిస్తాం. ఖరీఫ్ పంట కాలంలో వరి కూడా పండిస్తాం. అలా వచ్చిన వరి ధాన్యంలో కనీసం సగ బాగాన్ని మార్కెట్‌లో అమ్మివేస్తాం. మే నెలలో భారీగా తుఫాను వచ్చినా కూడా ఈ ఏడాది 27.7 మెట్రిక్ టన్నులు దక్కింది. గత ఏడాది వరకు మొక్క జొన్న పంట ఫలాన్ని కూడా మా గ్రామ స్థాయి దళారి, సేకరణకర్త, వ్యాపారి అయిన ముస్తాక్‌కే అమ్ముకునేదాన్ని. ముస్తాక్ మా ఇంటి దగ్గరికే వచ్చి తాను కొన్న సరుకును తీసుకెళ్లేవాడు. సరుకు నాణ్యతను చేతితో లెక్కకట్టి ధరను నిర్ణయించేవాడు. చేతితో తయారుచేసిన వెయింగ్ మెషీన్ సాయంతో సరుకును కొలుచుకువెళ్లేవాడు. ఆ రకంగా లెక్క కట్టిన సరుకు మొత్తంలో తేమ శాతం పేరు చెప్పి క్వింటాలుకు కనీసం 7 నుంచి 8 కిలోల వరకు కోత వేసేవాడు. మిగిలిన అనేక మందిలాగే నేను కూడా గట్టిగా బేరం ఆడలేకపోయేదాన్ని. ఎందుకంటే సాగు సమయంలో ఖర్చుల కోసం ముస్తాక్ నుంచే మేమంతా రుణాలు తీసుకుని అవసరాలు తీర్చుకునేవాళ్లం.

మార్చి, 2015 మొదటి వారంలో అన్నపూర్ణ ప్రొడ్యూసర్ గ్రూప్ సమావేశానికి నేను కూడా హాజరయ్యాను. నాకు ఆ గ్రూపులో సభ్యత్వం ఉంది. అక్కడే తెలిసింది - ఈ గ్రూపులు మొక్క జొన్న సేకరణ చేపట్టి, ఏపీసీఎల్ ఆధ్వర్యంలో దానిని విక్రయించే బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నట్టు గుర్తించాను. అప్పటినుంచి జీవిక, టెక్నోసెర్వ్ ఆధ్వర్యంలో జరిగిన అన్ని సమావేశాలకు హాజరయ్యాను అక్కడ అనుసరిస్తున్న విధానాలన్నిటినీ అవగాహన చేసుకున్నాను. మిగిలిన వారికి తెలియజేసి, వారికి కూడా సరైన అవగాహన కలిగించాను.

> నా జీవితంలో ఇదే మొదటిసారి రైతు గుమ్మం ముందు నుంచి సరుకు కొనుగోలు చేయడం కోసం ఒకరు ముందుకు రావడం అనేది చూసి. నేనే కాదు. మా గ్రూపులోని ఇతర సభ్యులందరూ అలాగే అనుకున్నారు. అందుకే ఇక నుంచి మేమంతా మా ఉత్పత్తిని కంపెనీకే విక్రయిస్తాం. - షకీలా ఖతూన్, అన్నపూర్ణ ప్రొడ్యూసర్ గ్రూప్, ఏప్రిల్ 24, 2015

కష్టపడి పంట పండించిన తర్వాత అనుసరించవల్సిన విధివిధానాలను ప్రాజెక్టు టీమ్ సూచించిన విధంగా అనుసరించడం ప్రారంభించాను. అందువల్లనే నేను పండించిన పంట యావత్తూ గ్రేడ్ సరుకుగా నాణ్యమైనదిగా నిరూపించగలిగాను. తేమ నిర్ధారణకు గాను స్వయంగా అవసరమైన పరికరాలను సమకూర్చుకున్నాను. ఇక సరుకును తూచడానికి అవసరమైన ఎలక్ట్రానిక్ వెయింగ్ యంత్రాలను కూడా సిద్ధంచేసుకున్నాను. ఇప్పుడు నేను విక్రయించిన సరుకు సొమ్ము మూడు రోజుల్లోనే నేరుగా నా బ్యాంకు ఖాతాలోకే జమ అవుతోంది. అంతా పారదర్శకంగా సాగుతున్న ఈ ప్రక్రియను గమనించిన తరువాత నేను పండించిన మొత్తం పంటను ప్రొడ్యూసర్ గ్రూపు వాళ్లకే విక్రయిస్తున్నాను. అలా చేయడం వల్ల క్వింటాల్‌కు రూ.1003 వచ్చింది. అంటే ముస్తాక్‌కు అమ్మినప్పుడు వచ్చిన సొమ్ముకన్నా ఆరు రెట్లు ఎక్కువ. కంపెనీకి లాభాలు వచ్చినప్పుడు ప్రొడ్యూసర్ గ్రూప్ సభ్యత్వం ఉన్నందున నాకు పేట్రొనేజ్ బోనస్ కూడా వస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి కంపెనీకి మంచి లాభాలు వచ్చాయి. అందులో నాకు 11.3 శాతం దక్కింది.



*ఉత్పత్తిదారుల కంపెనీ వాణిజ్య కార్యకలాపాలను విస్తరించాలని ఆశిస్తున్న సభ్యులు......*

చేతిలో విశ్వసనీయం కానీ కొలమానాల స్థానంలో కచ్చితత్వం తో కూడిన వెయింగ్ మెషీన్‌లను, అత్యున్నత పారిశ్రామిక నాణ్యతా ప్రమాణాలున్న గ్రేడింగ్ విధానాలను ఉపయోగించాల్సిందిగా ఒత్తిడి చేయగలుగుతున్నారు. ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ ఏర్పాటు వల్ల ఉత్పత్తిదారుల కంపెనీ జాతీయ స్థాయిలో కొనుగోలుదారులతో అనుసంధానం అవుతున్నాయి. అదే సమయంలో చెల్లింపుల్లో జాప్యం నివారించడం సాధ్యమవుతుంది. అమ్మకం జరిగిన మూడు నుంచి ఐదు రోజులలోపునే సొమ్ము అందుతుండడంతో వారు చేసిన పంట లేక ఇతర రుణాలను సకాలంలో చెల్లించగలుగుతున్నారు.

ఈ ఉత్పత్తిదారుల కంపెనీ సేకరించిన మొక్క జొన్నను జీవిక బ్రాండ్‌తో విక్రయించేవారు. నాణ్యత బాగుండడంతో కొనుగోలుదారుల్లో మంచి పేరు సంపాదించింది. ప్రతీ ప్రొడ్యూసర్ గ్రూపు దగ్గర తేమ కొలిచే పరికరాలు ఉండడం వల్ల తమ పంటను సరైన రీతులో ఎండబెట్టి విక్రయానికి అనువుగా శుద్ధిచేయడానికి వీలవుతోంది. దానిని ఏ గ్రేడ్ సరుకుగా తీర్చిదిద్దగలుగుతున్నారు.

## ముజఫర్‌పూర్‌కు విస్తరణ

టెక్నోసెర్వ్ మద్దతుతో 2016 మే నుంచి జీవిక సంస్థ కొన్ని రకాలైన పండ్లు (లిచ్చీ వంటివి) కాయగూరల మార్కెట్‌లో దళారుల వ్యవస్థను పూర్తిగా తొలగించింది. ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర కల్పించింది. ఇందుకోసం ముజఫర్‌పూర్‌లో సమర్పణ్ జీవికా మహిళా కిసాన్ ప్రొడ్యూసర్ కంపెనీని ఏర్పాటుచేసింది. ఈ కంపెనీ ప్రారంభంలో అంటే 2016లో సుమారు 6120 కిలోల లిచీ పండ్లను సేకరించింది. ఎన్‌ఈఎం ఎల్ ద్వారా ముంబయి, అహ్మదాబాద్, బెంగుళూరు వంటి సుదూర ప్రాంతాలలోని మార్కెట్లకు విక్రయించగలిగింది. ఫలితంగా కంపెనీకి నికర లాభం రూపంలో రూ.5 లక్షలు వచ్చాయి. అంటే 8 శాతం లాభం అన్న మాట. ఈ తొలి యత్నం లో పాల్గొన్న రైతుల సంఖ్య తక్కువే అయినా వారికి 16 శాతం అదనంగా ఆదాయం వచ్చింది.

ఇక కూరగాయల విషయానికి వస్తే సాక్రా బ్లాక్ రైతులు బిగ్ బజార్ సంస్థకు 5 మెట్రిక్ టన్నులను సరఫరా చేసి లక్షా యాభై వేల రూపాయల ఆదాయం సంపాదించగలిగారు. అంతేకాదు, నెల రోజుల్లో సొంతంగా (ఆగస్టు, 2016) రిటైల్ షాపుల చెయిన్ ఏర్పాటుచేసుకోగలిగారు.

## ముందడుగులు

ఏఏపీసీఎల్ రానున్న రోజుల్లో మొక్క జొన్న ఒక్కటే కాకుండా బంగాళా దుంప, అరటి పంటలపై కూడా దృష్టి కేంద్రీకరించనున్నది. మరో వైపు ముజఫర్‌పూర్ కంపెనీ లిచీ పండ్లు, కూరగాయల విషయంలోనే కాకుండా పప్పు ధాన్యాల వ్యాపారంలోకి కూడా అడుగుపెట్టడానికి సిద్ధమవుతోంది. ఈ రెండు కంపెనీలు సభ్యుల ప్రయోజనాల కోసం ఎక్కువ గిరాకీ ఉన్న ఎరువుల సరఫరా బాధ్యతను కూడా స్వీకరించేందుకు ప్రతిపాదనలు పరిశీలిస్తున్నాయి. ఏఏపీసీఎల్ సభ్యత్వాల సంఖ్యను మూడేళ్ల వ్యవధిలో 10000కు విస్తరించాలని యోచిస్తోంది. అదే సమయంలో టర్నోవర్‌ను రూ.100 కోట్లకు విస్తరించాలని ఆశిస్తోంది.

సంప్రదింపుల ద్వారా సమిష్టిగా బేరసారాలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను అన్ని ప్రొడ్యూసర్ కంపెనీల సభ్యులు గుర్తించారు. అందుకు అండగా నిలుస్తున్న ప్రొడ్యూసర్ గ్రూపులో సభ్యులుగా చేరడంపై సగర్వంగా భావిస్తున్నారు. ◆

**Debaranjan Pujahari**
Associate Practice Leader

**Aarti Dayal**
Manager, Communications and New Program Development

**TechnoServe India**
B1-201, Centre Point, Opposite Bawla Masjid
243 A N M Joshi Marg, Lower Parel (E), Mumbai - 400 013.

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 18, సంచిక 4, డిసెంబరు 2016.